నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
1
ఆదివారం | సెప్టెంబర్ 03, 2023 | www.navatelangana.com

మా ఓటు.. స్పీకర్‌కే

- పోచారం శ్రీనివాస్‌కు మద్దతునిస్తూ కులసంఘాల తీర్మానాలు


తీర్మాన ప్రతులు స్పీకర్‌కు అందజేత

నవతెలంగాణ-వర్ని

మరోసారి మా ఓటు స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డికే అని పలువురు కులసంఘాల నాయకులు తెలిపారు. ఆయా కులసంఘాల వారీగా చేసిన తీర్మాన కాపీలను శనివారం పోచారమ్‌కు అందజేశారు. బీఆర్‌ఎస్ నుంచి మరోసారి బాన్సువాడ నియోజకవర్గ అభ్యర్థిగా పోచారం శ్రీనివాస్‌రెడ్డికి టికెట్ ఖరారు చేయడంతో పలువురు మద్దతు తెలుపుతున్నారు. నియోజకవర్గంలోని 25 గ్రామ పంచాయతీల నుంచి కుల సంఘాల పెద్దలు భారీ ఎత్తున గత వారం రోజులపాటు నుంచి ఏకగ్రీవంగా స్పీకర్‌కు తమ ఓటు వేస్తామని తీర్మాన పత్రాలు స్పీకర్‌కు అందజేస్తున్నారు.

ఓటర్ జాబితాపై అవగాహన కల్పించాలి

- అదనపు కలెక్టర్ మను చౌదరి

నవతెలంగాణ-పిట్లం

బిఎల్‌వోలకు ఓటర్ జాబితా పై పూర్తి అవగాహన కల్పించాలని తహసిల్దార్ రామ్మోహన్ రావుకు జిల్లా అదనపు కలెక్టర్ మను చౌదరి ఆదేశించారు. శనివారం మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన బిఎల్ఓ సెంటర్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటరు జాబితాపై కొందరు బి ఎల్ ఓ లకు అవగాహన లేక తప్పొప్పులు జరిగే ఆస్కారం ఉందని, ఎలాంటి తప్పులు లేకుండా పక్కా ఓటర్ జాబితాను సిద్ధం చేయాల్సిన బాధ్యత తహసీల్దార్ కార్యాలయంపై ఉందని అన్నారు. 18 సంవత్సరాలు నిండిన ఏ ఒక్క యువతి యువకులు మిస్ కాకుండా ఓటరు జాబితాలో చేర్చాలని ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల తహసిల్ కార్యాలయ సిబ్బంది మండల కేంద్ర పంచాయితీ సెక్రెటరీ యాదగిరి , బి ఎల్ వో లు పాల్గొన్నారు.

తుది ఓటరు జాబితాలో తప్పులుండొద్దు


వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

- దరఖాస్తులను వెంటవెంటనే పరిశీలించాలి
- రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్



నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

తుది ఓటరు జాబితాలో ఎలాంటి తప్పిదాలకు ఆస్కారం లేకుండా పకడ్బందీ పరిశీలన జరపాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్ రాజ్ సూచించారు. డబుల్ ఎంట్రీ, బోగస్ పేర్లు లేకుండా జాబితాను బీ.ఎల్.ఓ మొదలుకుని ఈ.ఆర్.ఓ స్థాయి వరకు క్షుణ్ణంగా పరిశీలించాలని అన్నారు. అర్హులైన ఏ ఒక్క ఓటరు పేరు సైతం జాబితా నుండి గల్లంతు కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని హితవు పలికారు. ఎన్నికల సన్నద్ధతలో భాగంగా శనివారం సాయంత్రం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లతో సి.ఈ.ఓ సమీక్ష జరిపారు. క్షేత్ర స్థాయిలో సిబ్బంది ఇంటింటికి తిరిగి పరిశీలన జరిపే ప్రక్రియను పూర్తి చేయించాలన్నారు. మార్పులు-చేర్పులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను వెంటదివెంట పరిశీలిస్తూ, రోజువారీగా పరిష్కరించాలని, వాటిని ఆన్లైన్ లో అప్ లోడ్ చేయించాలన్నారు. ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్న సందర్భంగా వచ్చిన దరఖాస్తులు, వాటి పరిశీలన ప్రక్రియ ఏ దశలో ఉందన్న వివరాలను ఆరా తీశారు. ఈ విషయమై కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు స్పందిస్తూ, జిల్లాలో మొదటి రెండు రోజులు నిర్వహించిన స్పెషల్ క్యాంపెయిన్ సందర్భంగా 5600 దరఖాస్తులు క్షేత్రస్థాయిలో దాఖలు అయ్యాయని సీఈఓ దృష్టికి తెచ్చారు. ప్రస్తుతం మలివిడత లోనూ దాదాపు అంతే సంఖ్యలో దరఖాస్తులు వస్తాయని ఆశిస్తున్నామన్నారు. ఈ.ఆర్. ఓలు, ఏ.ఈ.ఆర్.ఓ ల స్థాయిలో పెండింగ్లో ఉన్న దరఖాస్తులను యుద్ధప్రాతిపదికన పరిశీలన జరిపి పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కాగా, కొత్తగా నమోదైన ఓటర్లకు నిర్దిష్ట గడువులోపు గుర్తింపు కార్డులు చేరేలా క్రమం తప్పకుండా పర్యవేక్షణ చేయాలని, ఈ-ఓటరు ఐ.డీని హెల్ప్ లైన్ యాప్ ద్వారా కూడా డౌన్ లోడ్ చేసుకోవచ్చుననే విషయాన్ని ఓటర్లకు తెలియజేస్తూ విస్తృత ప్రచారం నిర్వహించాలని సీఈఓ సూచించారు. సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను జాగ్రత్తగా గుర్తించాలని, షెడ్యూల్డ్ కులాలు, తెగల సమూహాలు ఉండే ప్రాంతాలతో పాటు వయో వృద్ధులు, సెక్స్ వర్క ర్లు, దివ్యాంగులైన ఓటర్లు పోలింగ్ లో పాల్గొనేలా ప్రత్యేకంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు. వివిధ రంగాల్లో ప్రఖ్యాతి గడించిన ప్రముఖులతో అవగాహన కల్పిస్తే సత్ఫలితాలు వచ్చేందుకు ఆస్కారం ఉంటుందని అభిప్రాయ పడ్డారు. ముఖ్యంగా 18 - 19 సంవత్సరాల వయస్సు కలిగిన యువతీ,యువకులు తప్పనిసరిగా ఓటరు జాబితాలో పేర్లు నమోదు చేసుకునేలా ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలని సూచించారు. పోలింగ్ కేంద్రాలలో అన్ని మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, పోలింగ్ సందర్భంగా ఎలాంటి తప్పిదాలు, లోటుపాట్లకు అవకాశం లేకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా కృషి చేయాలన్నారు.

ఇదిలాఉండగా, రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారితో వీ.సీ ముగిసిన మీదట కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు ఈ.ఆర్.ఓలు, ఏ.ఈ.ఆర్.ఓలు, తహశీల్దార్లతో సమీక్ష జరిపారు. ఓటరు జాబితా పక్కాగా రూపొందేలా అన్ని స్థాయిలలో పకడ్బందీ పరిశీలన జరపాలని ఆదేశించారు. ముఖ్యంగా 18 - 19 సంవత్సరాల వారు ఏ ఒక్కరు కూడా తప్పిపోకుండా ఓటరు జాబితాలో పేర్లు నమోదు చేసుకునేలా చూడాలన్నారు. ఈ మేరకు కళాశాలల నిర్వాహకులు, విద్యార్థులతో అవగాహన సమావేశాలు నిర్వహించాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్సులో అదనపు కలెక్టర్లు పి.యాదిరెడ్డి, చిత్రామిశ్రా, నగరపాలక సంస్థ కమిషనర్ ఎం.మకరంద్, డీసీఓ సింహాచలం, ఆర్డీఓలు రాజేంద్ర కుమార్, రాజాగౌడ్, వినోద్ కుమార్, భుజంగరావు, సహాయ ఈ.ఆర్.ఓలు, ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు పవన్, సాత్విక్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

టీఎస్‌ఆర్టీసీ 'లిఫ్ట్'..



వాహనదారులకు లిఫ్ట్ అడుగుతూ.. ఆపిన వారి బైక్ ఎక్కుతున్న విద్యార్థులు | ఆర్టీసీ బస్సు ఎక్కుతున్న హాస్టల్ విద్యార్థులు

నిజామాబాద్ నగరంలోని న్యాల్‌కల్ రోడ్డులో గల సమీకృత హాస్టల్ నుంచి పలువురు విద్యార్థులు శంకర్‌భవన్‌తో పాటు న్యాల్‌కల్‌లోని జడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో చదువుతుంటారు. హాస్టల్ నుంచి రెండు స్కూళ్లు సైతం సుమారు కిలోమీటరున్నర దూరం ఉంటాయి. దీంతో విద్యార్థులు బండెడు పుస్తకాలు భుజాన వేసుకొని నడిచివెళ్లలేక.. అటుగా వెళ్తున్న వాహనదారులను 'లిఫ్ట్' అడుగుతుండేవారు. ఆటోవాలలతో పాటు, పలువురు వాహనదారులు విద్యార్థులను ఎక్కించుకొని స్కూళ్ల దగ్గర దిగబెట్టేవారు. అయితే టీఎస్‌ఆర్టీసీ విద్యార్థులకు ఉచితంగా బస్‌పాసులు మంజూరు చేయడంతో.. హాస్టల్ పిల్లలకు సైతం బస్‌పాస్‌లు మంజూరు అయ్యాయి. దీంతో డిపో నుంచి బస్టాండ్ వైపు వెళ్లే బస్సులు.. బస్టాండ్ వైపు నుంచి డిపోనకు వచ్చే బస్సులు.. విద్యార్థులను ఎక్కించుకొని స్కూళ్ల వరకు వారికి 'లిఫ్ట్' ఇస్తుండటంతో.. విద్యార్థులు ఖుషీ అవుతున్నారు. సమయం కాగానే అందరూ వచ్చి వరుసలో నిలబడి బస్సులో ఎక్కుతూ స్కూల్‌కు వెళ్తున్నారు.

ఫొటోలు: మీస మధు. నవతెలంగాణ, నిజామాబాద్

పద్మాజివాడి సబ్‌స్టేషన్ పరిధిలో కరెంటు అంతరాయం

నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని పద్మాజివాడి పరిధిలోని సబ్‌స్టేషన్‌లో కరెంట్ అంతరాయం కలిగినట్లు రైతులు శనివారం తెలిపారు. సుమారు 5 గంటల పాటు అంతరాయం కలగడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఒక దిక్కు వర్షాలు లేక, మరోవైపు కరెంట్ లేకపోతే రైతుల పరిస్థితి ఎలా అని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఒక దిక్కు 24 గంటల పాటు వ్యవసాయానికి ఉచిత కరెంట్ ఇస్తున్నామని చెప్పుతున్నా రైతులకు కరెంట్ సరఫరా మాత్రం లేదని ఆందోళన చెందుతున్నారు. చిరు వ్యాపారులకు కూడ కరెంట్ సరఫరా లేకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

పిట్లం మార్కెట్ యార్డులో దుకాణాల అద్దెకు ఆన్‌లైన్‌లో వేలం

నవతెలంగాణ-కామారెడ్డి

పిట్లం వ్యవసాయ మార్కెట్ యార్డు నందు నూతనంగా నిర్మించిన 20 దుకాణ సముదాయాలను అద్దె ప్రాతిపదికన ఆన్ లైన్ ద్వారా బహిరంగ వేలం నిర్వహించనున్నామని జిల్లా మార్కెటింగ్ అధికారి రమ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కాగా ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇందులో ఎస్సీలకు 3, ఎస్టీకి ఒకటి, బి.సి కి 5, పి హెచ్ సి కి ఒక దుకాణం, జనరల్ క్యాటగిరి క్రింద ఇతరులకు 10 దుకాణాలు కేటాయించినట్టు తెలిపారు. వేలంలో పాల్గొనదలచిన ఆసక్తి గల అభ్యర్థులు పిట్లం వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయపు పనివేళలలో 500 రూపాయలు చెల్లించి దరఖాస్తు పొందాలని సూచించారు. దరఖాస్తు వెంట కార్యదర్శి, వ్యవసాయ మార్కెట్ కమిటీ, పిట్లం పేర 15,000 రూపాయల డి.డి. ని ఏదైనా జాతీయ బ్యాంక్ నుండి తీసి, స్వంత చిరునామా గల ఏదేని ఆధార్/రేషన్/ఓటర్ కార్డును జతచేసి ఈ నెల 11 న సాయంత్రం 5 గంటలలోగా అదే కార్యాలయంలో అందజేయవలసినదిగా ఆమె సూచించారు. వివరాలకు కార్యదర్శి మొబైల్ నెంబర్ 7330733249 ను సంప్రదించవలసినదిగా ఆమె సూచించారు.

బాధిత కుటుంబానికి పరామర్శ


స్వయంగా పాడె మోస్తున్న ఎమ్మెల్యే హన్మంత్‌షిండే

నవతెలంగాణ-పిట్లం

మండలంలోని బొల్లపల్లి గ్రామ సర్పంచ్ పట్లోళ్ల సావిత్రి భర్త రవీందర్‌రెడ్డి శనివారము తెల్లవారుజామున అనారోగ్యంతో మృతి చెందగా ఎమ్మెల్యే హన్మంత్ షిండే వారి కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన పార్థీవ దేహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించి.. అనంతరం అంత్యక్రియల్లో పాల్గొని ఎమ్మెల్యే మన్మంత్ షిండే స్వయంగా పాడె మోశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ సీనియర్ నాయకుడు , మాజీ సర్పంచ్ రవీందర్ రెడ్డిని కోల్పోవడం బాధాకరమని, పార్టీకి తీరనిలోటని అన్నారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రగాఢ సంతాపం వ్యక్తపరిచారు. ఎమ్మెల్యే వెంట మండల సీనియర్ నాయకులు , ప్రజా ప్రతినిధులు , శ్రేయోభిలాషులు ఉన్నారు.

రైల్వేగేట్‌ను తెరవాలి


మూసివేసిన గంజ్‌కమాన్ రైల్వే గేటు ఎదుట నాయకుల నిరసన

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నిజామాబాద్ నగరం పాత గంజ్ కొత్త గంజ్‌కు మధ్యలో మూసివేసిన రైల్వేగేట్‌ను వెంటనే తెరవాలని తెలుగుదేశం పార్టీ నిజామాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు దేగాం యదాగౌడ్ డిమాండ్ చేశారు. స్థానిక రైల్వే గేట్ పరిరక్షణ కమిటీ నాయకులు సాయికుమార్ ఆధ్వర్యంలో శనివారం నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమంలో భాగంగా దేగాం యాదగౌడ్ మాట్లాడుతూ నిత్యం రద్దీగా ఉండే పాత గంజి కొత్తగా రైల్వే గేట్ గత కొన్ని రోజులుగా మొత్తానికి మూసి వేశారని, దీని కారణం చేత స్థానిక వ్యాపారులు వాహనదారులకు రవాణా సౌకర్యం ఇబ్బందికరంగా మారిందని తెలిపారు. దీనిని దృష్టిలో ఉంచుకొని రైల్వే జీఎం లేదా స్థానిక ఎమ్మెల్యే స్థానిక ఎంపీ చొరవ చూపి రైల్వే గేటు ని తెరిపించాలని కోరారు. లేనియెడల ఆ మార్గానికి ప్రత్యామ్నాయం ఏర్పాటు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అర్బన్ ఇంచార్జ్ వినోద్ కుమార్, మైనార్టీ నాయకులు ఫిరోజ్, నాగేశ్వరరావు, స్థానిక వ్యాపార సముదాయాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వంతో చర్చలు సఫలం

- కాంట్రాక్ట్ ఏఎన్‌ఎంలపై కమిటీ వేసి జీవో ఇచ్చేందుకు ప్రభుత్వం అంగీకారం
- జీవో కాపీ వచ్చిన అనంతరం 4న సమ్మె విరమిస్తాం : సీఐటీయూ


నినాదాలు చేస్తున్న ఏఎన్‌ఎంలు, సీఐటీయూ నాయకులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

పబ్లిక్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ డైరెక్టర్ డాక్టర్ గడాల శ్రీనివాసరావు తో కార్మిక సంఘాల కాంట్రాక్టు ఏఎన్ఎంల చర్చలు సఫలం అయ్యాయని కమిటీ వేయడానికి జీవో ఇవ్వడానికి ప్రభుత్వం అంగీకరించిందని సీఐటీయూ జిల్లా కార్యదర్శి నూర్జహాన్ తెలిపారు. సెప్టెంబర్ 4న జీవో కాపీ ఇచ్చిన అనంతరం సమ్మె ముగిస్తామని శనివారం తెలిపారు. ప్రభుత్వం స్పందించింది కమిటీ వేస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు ఇచ్చిన నాటి నుంచే సమ్మె విరమిస్తామని చెప్పారు.

సర్వీస్‌ను రెగ్యులరైజ్ చేయడం, వేతనాల తదితర డిమాండ్లతో ఈ నెల 15 నుంచి కాంట్రాక్ట్ ఏఎన్‌ఎంలు సమ్మె చేస్తున్నారు. ఆరోగ్యశాఖ మంత్రివర్యులు హరీశ్‌రావు సూచనతో ఇప్పటికే పలు మార్లు కార్మిక సంఘా లతో చర్చలు జరిగినట్టు తెలిపారు. శుక్రవారం మరోసారి కార్మిక సంఘాలను పిలిపించి చర్చలకు ఆహ్వానించారని, సీఐటీ యూ, ఏఐటియుసి, బీఆర్‌టీ యూ తదితర సంఘాల లీడర్లు, కాంట్రాక్ట్ ఏఎన్‌ఎంల ప్రతినిధులకు చర్చలకు పిలిపించారు. క్షేత్రస్థాయిలో నిత్యం ప్రజలతో మమేకమవుతూ, వారికి వైద్య సేవలు అందించే ఏఎన్ఎంలు సమ్మె చేయడం వల్ల తలెత్తుతున్న ఇబ్బందులను కూడా వారికి వివరించడం జరిగింది. ఏఎన్ఎంల డిమాండ్లను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలిస్తున్నందున, సమ్మె విరమించి విధుల్లో చేరాలని సూచించారు.

కాంట్రాక్ట్ ఏఎన్ఎంల డిమాండ్ల అమలునకు ఉన్న సాధ్యాసాధ్యాలపై కమిటీ వేస్తామని అన్నారు. విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లగా, కమిటీ వేసేందుకు ప్రభుత్వం అంగీకరించింది. కమిటీ వేస్తున్న అంశాన్ని కూడా ఏఎన్‌ఎంలకు వివరిస్తూనే, సమ్మె విరమించాలని విజ్ఞప్తి చేశారు. ఇందుకు వారు కూడా సానుకూలంగా స్పందించారు. కమిటీ వేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చిన నాటి నుంచే సమ్మె విరమిస్తామని హామీ ఇచ్చారు. ఈ నెల 4వ తేదీ నాటికి కమిటీ వేస్తూ ఉత్తర్వులు విడుదల చేయనున్నట్టు తెలిపారని చెప్పారు.

ఓటమి భయంతోనే అరెస్టులు

- బీజేపీ నాయకులు నాయుడు రాజు


మాట్లాడుతున్న రాజు

నవతెలంగాణ-బిచ్కుంద

కామారెడ్డి నియోజకవర్గం నుండి సీఎం కేసీఆర్ పోటీ చేసిన బిజెపి అభ్యర్థి చేతిలో చిత్తుగా ఓడిపోతారని ఆ భయంతోనే కామారెడ్డిలో బిజెపి నాయకులు కాటేపల్లి రమణారెడ్డిని అరెస్టు చేసి భయభ్రాంతులకు గురి చేస్తున్నారని బిజెపి నాయకులు నాయుడు రాజు అన్నారు. శనివారం బిచ్కుంద మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2017 నుండి బిజెపి పార్టీలో క్రియాశీలకంగా వ్యవహరిస్తూ పార్టీ అభివృద్ధికి కృషి చేశామని 2019లో తన సోదరుడు నాయుడు ప్రకాష్‌కు బాన్సువాడ నియోజకవర్గం నుండి పార్టీ తరవున అభ్యర్థిగా అధిష్టానం నిలబెట్టిందన్నారు. ప్రస్తుతం జుక్కల్ నియోజకవర్గం నుండి తాను బిజెపి పార్టీ నుండి పోటీ చేయడానికి సిద్ధంగా ఉన్నానని అధిష్టానం నిర్ణయం మేరకు జుక్కల్ నియోజకవర్గంలో ప్రతి గ్రామంలో తిరిగి కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రచారం నిర్వహించి గ్రామాల్లో మౌలిక వసతులు పరిశీలించి కెసిఆర్ ప్రజలకు చేస్తున్న దగాను వివరిస్తామన్నారు. జుక్కల్ నియోజకవర్గంలో పాదయాత్ర రూట్ మ్యాప్ రాగానే నిజాంసాగర్ మండలం నుండి పాదయాత్ర మొదలవుతుందని కాటేపల్లి రమణారెడ్డి అరెస్టు సందర్భంగా సహకరించిన నాయకులకు, కార్యకర్తలకు, పత్రికా విలేకరులకు కృతజ్ఞతలు తెలిపారు.

రాఘవ లైఫ్ సైన్సెస్ ఫార్మా కంపెనీ ఎదుట
భార్యభర్త ఆత్మహత్యాయత్నం



పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నం చేస్తున్న భార్యభర్తలు

- బస్సు బకాయిలు అడిగితే దౌర్జన్యానికి పాల్పడుతున్నారని ఆవేదన
- కత్తి, పెట్రోల్‌తో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన భార్యాభర్తలు
- కంపెనీ ముందు తీవ్ర ఉద్రిక్తత

నవతెలంగాణ-భిక్కనూర్

కెమికల్ కంపెనీలో బస్సులను అద్దెకు పెట్టి ప్రతినెల చెల్లిస్తున్న కంపెనీ ఒక్కసారిగా అద్దె చెల్లించకుండా భార్యాభర్తలపై దౌర్జన్యం చేయడంతో శనివారం అద్దె బకాయిల కోసం భార్యాభర్తలు కంపెనీకి వెళ్లగా అద్దె చెల్లించేది లేదని, బస్సు యొక్క కాంట్రాక్టర్ రద్దు చేయడం జరిగిందని మీకు నచ్చిన చోట చెప్పుకోండి అని ఫార్మా కంపెనీ దౌర్జన్యానికి పాల్పడిన సంఘటన చోటుచేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని జంగంపల్లి గ్రామానికి చెందిన బాధితుడు శివరాజు అంతంపల్లి గ్రామ శివారులో ఉన్న రాఘవ లైఫ్ సైన్స్ ఫార్మా కంపెనీలో కాంట్రాక్ట్ పద్ధతి పై బస్సును అద్దెకు పెట్టించాడు. అద్దె ప్రాతిపదికన ప్రతి నెల లక్ష 22 వేల రూపాయలు రావాలి. గతంలో బాగానే చెల్లించిన కంపెనీ ఆరు నెలల నుండి బస్సు అద్దె చెల్లించకుండా తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని, అద్దె డబ్బులు అడుగుతే కాంట్రాక్టు రద్దు చేశామని నీకు నచ్చిన చోట చెప్పుకో అని కంపెనీ యాజమాన్యం దౌర్జన్యానికి పాల్పడుతున్నట్లు బాధితులు తెలిపారు. బస్సు ఈఎంఐ కట్టలేక ఫైనాన్స్ కంపెనీ వాళ్ళు బస్సు తీసుకెళ్లారని, అద్దె డబ్బులు అడిగి విసిగి చెందిన శివరాజు, శివరాజు భార్య జ్యోతి శనివారం కంపెనీ ముందు తన వద్ద తెచ్చుకున్న పెట్రోల్ ను ఒంటిపై పోసుకొని, కత్తితో పొడుచుకునే ప్రయత్నం చేశారు. అద్దె డబ్బులు చెల్లించకుంటే కంపెనీ ముందు ఆత్మహత్య చేసుకుంటామని హెచ్చరించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని బాధితులను సమదాయించె ప్రయత్నం చేశారు. రెండు గంటలకు పైగా కంపెనీ ముందు తీవ్ర ఉద్రిక్తత ఘర్షణ చోటు చేసుకుంది. అపస్మారక స్థితిలోకి వెళ్లిన బాధితుని భార్య జ్యోతిని కామారెడ్డి ఆస్పత్రికి తరలించగా, బాధితుడు శివరాజును పోలీస్ స్టేషన్ తరలించారు.

గతంలో కూడా రాఘవ లైఫ్ సైన్స్‌లో పనిచేసిన కార్మికులకు సరైన సమయంలో జీతాలు ఇవ్వక తీవ్ర ఇబ్బందులకు గురి చేసే వారిని, కార్మికులకు రావాల్సిన వేతనాల కోసం కంపెనీ చుట్టూ తిరిగి తిరిగి అలిసి పోయిన కార్మికులు ఎందరో ఉన్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. రియాక్టర్ పేలి కార్మికులకు గాయాలైన ఘటనలు కూడా కంపెనీలో చోటుచేసుకున్నాయి. కార్మికుల కడుపు కొడుతూ జీతాలు ఇవ్వకుండా, అద్దె డబ్బులు చెల్లించకుండా దౌర్జన్యం చేస్తున్న కంపెనీ పై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని కంపెనీ ద్వారా మోసపోయిన బాధితులు ఆరోపిస్తున్నారు.

104 సిబ్బందిని రెగ్యులర్ చేయాలి

ధర్నాచౌక్‌లో 104 ఉద్యోగుల ధర్నా



ధర్నాలో నినాదాలు చేస్తున్న 104 సిబ్బంది, సీఐటీయూ నాయకులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

గత 15 సంవత్సరాలుగా ఎలాంటి భద్రత లేకుండా చాలీచాలని వేతనాలతో ప్రజలకు సేవలు అందిస్తున్న 104 ఉద్యోగులను వెంటనే రెగ్యులర్ చేయాలని తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు శనివారం ధర్నా చౌక్‌లో ధర్నా కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా బీచుపల్లి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో 104 ఉద్యోగులు 2008 సంవత్సరం నుండి డీఎస్సీ ద్వారా రూల్ ఆఫ్ రిజర్వేషన్, రోస్టర్ పాయింట్ పద్ధతిలో జీవో నెంబర్ 1636, మెమో నెంబరు 20639ల ప్రకారం పూర్తిగా ప్రభుత్వ ఆధీనంలోనే డ్రైవర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, ల్యాబ్ టెక్నీషియన్లు, ఫార్మాసిస్టులు మరియు సెక్యూరిటీ గార్డులు దాదాపు 1350 మంది విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. గత 15 సంవత్సరాలుగా ఎలాంటి ఉద్యోగ భద్రత లేకుండా చాలీచాలని వేతనాలతో ప్రజలకుసేవలు అందిస్తున్నామని మమ్మల్ని ప్రభుత్వము తక్షణమే రెగ్యులర్ చేయాలని కోరారు. 2021 సంవత్సరం అక్టోబర్ నుండి 104 వాహనాలను ప్రభుత్వం పూర్తిగా నిలిపివేసిందని ఆ సందర్భంగా 104 ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చిందని ఉద్యోగులను పి హెచ్ సి, సిహెచ్ సి, లు ఏరియా హాస్పిటల్ లో టీ.హబ్ సెంటర్లలో రీ - డిప్లై చేసిందని తెలిపారు.

సిఐటియు జిల్లా కార్యదర్శి నూర్జహాన్ 104 ఉద్యోగుల ధర్నాకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 104 ఉద్యోగులు పూర్తిగా ప్రభుత్వ ఆధీనంలోనే పనిచేస్తున్నప్పటికీ వేతనాలు మాత్రం ఏజెన్సీల ద్వారా చెల్లించడం వలన సకాలంలో వేతనాలు అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తక్షణమే ఏజెన్సీ విధానాన్ని రద్దుచేసి ప్రభుత్వమే నేరుగా ఉద్యోగుల ఖాతాలో ట్రెజరీ ద్వారా వేతనాలు జమ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడన వినతి పత్రాన్ని జిల్లా కలెక్టర్‌కి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో 104 ఉద్యోగులు రాజేష్, కృష, సురేష్, సాయిలు, శ్రీనివాస్, సంధ్య, సుమలత, సోనీ, గౌస్, అజీమ్, తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) 104 ఉద్యోగుల సంఘం నిజామాబాద్ జిల్లా కమిటీ సభ్యులు ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

నాటుడు.. నరుకుడు


రోడ్డుపక్కన వైర్ల కింద ఉన్న చెట్టు నరికివేత

నవతెలంగాణ-భీంగల్

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అడవుల విస్తీర్ణ పెంచేందుకు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హరితహారంలో అన్ని శాఖల అధికారులను సమన్వయం చేస్తూ మొక్కలను నాటుతున్నారు. ఇందులో భాగంగానే హరితహారం నాలుగో విడతలో ప్రతి గ్రామంలో వెయ్యి మొక్కల కార్యక్రమాన్ని కూడా గత నాలుగు రోజుల క్రితం చేపట్టారు. వీటి సంరక్షణకు ప్రభుత్వం కూడా ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారు. కానీ ప్రధాన రహదారుల వెంట నాటిన హరితహారం చెట్లను విద్యుత్ అధికారులు విద్యుత్ తీగల కు అడ్డు వస్తుందని సాకుతో ఎక్కడికక్కడ నరికేస్తున్నారు. హరితహారంలో ఓ పక్క అధికారులు చెట్లు నాటుతుంటే మరో పక్క విద్యుత్ అధికారులు నరికివేయడమేంటని ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. భీంగల్ నుండి ఆర్మూర్ వెళ్లే ప్రధాన రహదారిలో ప్రభుత్వ కళాశాల వద్ద రోడ్డుకు పక్కనే ఉన్న చెట్లను నరికి వేసిన దృశ్యం నవతెలంగాణ క్లిక్ మనిపించింది.

ఓటరు నమోదు ఆకస్మిక పరిశీలన

నవతెలంగాణ-బాల్కొండ

మండల కేంద్రంలోని జిల్లా ప్రభుత్వ ఉన్నత పాఠశాలను శని వారం అదనపు కలెక్టర్ చిత్ర మిశ్రా సందర్శించారు. పోలింగ్ బూత్ కేంద్రాల వద్ద ప్రత్యేకంగా నిర్వహిస్తున్న ఓటరు నమోదు కార్యక్రమ నిర్వహణ, కేంద్రాల వద్ద విధులు నిర్వర్తిస్తున్న బీఎల్ఓ ల పనితీరును పరిశీలించారు.

18రోజుకు ఏఎన్ఎంల సమ్మె



నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ
సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఏఎన్ఎంలు చేపట్టిన సమ్మె 18వ రోజుకు చేరుకుంది. అందులో భాగంగా కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి వై.ఓమయ్య, యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి సంధ్యారాణి, యూనియన్ అధ్యక్షులు భాగ్యమ్మ, సంధ్యారాణి, స్వప్న, శ్రీలేఖ, సుజాత, శశికళ, సరస్వతి, భాగ్యలక్ష్మి ఏఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీవో నటరాజును వెంటనే అరెస్టు చేయాలి



నవతెలంగాణ-జక్రాన్‌పల్లి/నిజామాబాద్‌రూరల్
ప్రస్తుత జక్రాన్‌పల్లి ఎంపీడీవో నటరాజ్ ధర్పల్లి మండలం బంజారా మహిళపై చేసిన అఘాయిత్యాన్ని నిరసిస్తూ అతని వెంటనే అరెస్టు చేసి రిమాండ్‌కు పంపాలని ఆర్టీసీ చైర్మన్, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌ను నిజామాబాద్ జిల్లా బంజారా నాయకులు హైదరాబాద్ బస్సు భవన్‌లో కలిసి విన్నవించారు. కార్యక్రమంలో జిల్లా బంజారా నాయకులు ఏబీఎస్ఎస్ జిల్లా అధ్యక్షులు శ్రీ రామవత్ మోహన్ నాయక్, ఎల్‌హెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షులు మోహన్ నాయక్ చౌహన్, జిల్లా మీడియా అధికార ప్రతినిధి బానోత్ గోపాల్ నాయక్, జిల్లా ఉపాధ్యక్షులు బాదావత్ శంకర్ నాయక్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ శివరాం, ధర్పల్లి మండలాధ్యక్షులు మలావత్ లాలసింగ్ నాయక్ తదితరులున్నారు

జిల్లా అభివృద్ధి ప్రదాత.. వైయస్సార్

- కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు మానాల మోహన్‌రెడ్డి
- వర్ధంతి సందర్భంగా నివాళి

నవతెలంగాణ-విలేకరుల బృందం



కంఠేశ్వర్ : నివాళులర్పిస్తున్న నాయకులు

కంఠేశ్వర్ : ఉమ్మడి నిజామాబాద్ జిల్లా అభివృద్ధి ప్రదాత వైఎస్ఆర్ అని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి తెలిపారు. శనివారం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి సందర్భంగా కాంగ్రెస్ భవన్ నందు జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో రాజశేఖర్ రెడ్డి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఆయనతోపాటు పీసీసీ ఉపాధ్యక్షులు తాహెర్‌బిన్ హందన్, రూరల్ ఇన్చార్జి భూపతిరెడ్డి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మానాల మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. అభివృద్ధి ఫలాలు ప్రతి పేదవాడికి అందించాలని పరితపించిన నాయకుడు వైయస్సార్ అని తెలిపారు. ఉచిత కరెంటు, రాజీవ్ ఆరోగ్యశ్రీ జలయజ్ఞం, ఇందిరమ్మ ఇల్లు, అభయహస్తం, పావలా వడ్డీ, ఫీజు రియంబర్స్‌మెంట్, రైతుల పంట రుణాల మాఫీ, భూ పంపిణీ, 108, 104 సేవలు, పశుక్రాంతి, రేషన్‌కార్డులు పంపిణీ లాంటి సంక్షేమ పథకాలతో ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన మహానేత డాక్టర్ వైయస్సార్ అన్నారు.

ఉమ్మడి నిజామాబాద్ జిల్లా అభివృద్ధికి వైయస్సార్ ఎనలేని కృషి చేశారని ఉమ్మడి జిల్లాలో వైయస్సార్ హయాంలో జరిగిన అభివృద్ధి ఆయన ఆయన దివంగతులైన తర్వాత కాంగ్రెస్ పార్టీ హయాంలో జరిగిన అభివృద్ధి మాత్రమే తప్ప గత తొమ్మిది సంవత్సరాలుగా జిల్లా అభివృద్ధి శూన్యమని ఆయన అన్నారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లా అభివృద్ధిలో భాగంగా గుత్ప, అలీసాగర్, హనుమంత్‌రెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టులు నిర్మించడం ద్వారా దాదాపు లక్ష ఎకరాలకు సాగునీరు అందించారని, పురాతనమైన నిజాంసాగర్ కాలువ ఆధునీకరణ కోసం 500 కోట్లు వెచ్చించారని, జిల్లా ప్రజలకు ఉచిత వైద్యం అందించే విధంగా జిల్లా కేంద్రంలో ప్రభుత్వ ఆసుపత్రితో పాటు మెడికల్ కళాశాలను ఏర్పాటు చేశారని, విద్యార్థులకు ఉన్నత విద్యను అందించే ఉద్దేశంతో తెలంగాణ విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేశారని ఆయన గుర్తు చేశారు. జలయజ్ఞం ప్రాజెక్టులు కట్టి బీడు భూములను సస్యశ్యామలం చేసి వ్యవసాయాన్ని పండుగ చేశారని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇంటిని నిర్మించి వారికి సొంత ఇంటి కలను సాకారం చేశారని తెలిపారు. మైనారిటీ రిజర్వేషన్ కల్పించి మైనారిటీ విద్యార్థినీ విద్యార్థులను డాక్టర్లుగా ఇంజనీర్లుగా తయారు చేశారని, బడుగు బలహీన వర్గాల పిల్లలతో పాటు అగ్రవర్ణాల్లోని పేదల పిల్లలు ఉన్నత చదువులు చదువుకోవాలని ఫీజు రియింబర్స్‌మెంట్ పథకాన్ని ప్రవేశపెట్టారని, పేద ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని ఆరోగ్యశ్రీ పథకం ద్వారా కార్పొరేట్ ఆసుపత్రిలో ఉచిత వైద్యం అందేలా చేశారని అన్నారు. వైఎస్ఆర్ ఆశయాలను, లక్ష్యాలను సాధించే దిశగా ప్రతి ఒక్క కాంగ్రెస్ కార్యకర్త రానున్న కాలంలో పనిచేసి రాష్ట్రంలో, కేంద్రంలో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావడానికి కృషి చేయాలని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు.



ముప్కాల్‌లో..

కార్యక్రమంలో కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు ముప్ప గంగారెడ్డి, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు అంతా రెడ్డి రాజారెడ్డి, మీసాల సుధాకర్ రావు, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షులు వేణురాజ్, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు నీరడ్డి భాగ్య, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు లింగం, సేవాదళ్ జిల్లా అధ్యక్షులు సంతోష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు కేశ మహేష్, పీసీసీ మెంబర్ ఈసా, నిజామాబాద్ రూరల్ మాజీ మండల అధ్యక్షులు రమేష్, మహిళా కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి సుజాత, మహిళా కాంగ్రెస్ నగర అధ్యక్షురాలు రేవతి, సాయిలు, కిషన్, ఎన్ఎస్‌యూఐ నిఖిల్, నరేంద్ర సింగ్, మూష్కు పటేల్ తదితరులు పాల్గొన్నారు.

సిరికొండ : మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన చేసిన సేవలను స్మరించుకొని, వైఎస్ఆర్ లేని లోటు జీర్ణించుకోలేక పోతున్నామని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బాకారం రవి ఆవేదన వ్యక్తంచేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ యూత్ అధ్యక్షుడు భూషణ్ రెడ్డి, డిసిసి సెక్రెటరీ ఎర్రన్న, జిల్లా నాయకుడు బద్దం రామచందర్, మల్లేష్ యాదవ్, నర్సింగ్, బకారం సంతోష్, మైనార్టీ అధ్యక్షుడు ఆసిఫ్, సిరికొండ రమేష్, ఐటీ సెల్ అధ్యక్షుడు నవీన్ రెడ్డి, ఉపాధ్యక్షుడు భాస్కర్ రెడ్డి, కాంగ్రెస్ మండల నాయకులు పాల్గొన్నారు.

ముప్కాల్ : పేద, బడుగుబలహీనవర్గాల ఆశజ్యోతి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి 14వ వర్ధంతిని శనివారం మండల కేంద్రంతో పాటు మండలంలోని వివిధ గ్రామాలలో ఘనంగా నిర్వహించారు. మండలంలోని కొత్తపల్లి గ్రామంలో కిసాన్‌ఖేత్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు బద్దం సాగర్ రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అదేవిధంగా రెంజర్ల గ్రామంలో పార్టీ మండల అధ్యక్షులు ముత్యంరెడ్డి ఆధ్వర్యంలో వర్ధంతిని చేపట్టారు. ఆయన ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ కమిటీ జిల్లా డెలికేట్ సెక్రటరీ జైడి చంద రవి, కిసాన్ ఖేత్ కాంగ్రెస్ మండలాధ్యక్షులు బద్దం సాగర్ రెడ్డి, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు గడ్డం చిన్నారెడ్డి, బీసీ సెల్ మండలాధ్యక్షులు ఆకుల రమేష్, కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షులు ఆకుల రాజేశ్వర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు లక్ష్మణ్, రాజేశ్వర్‌గౌడ్, దేవగౌడ్, నడిపి బావన్న, శంకర్, గంగాధర్, మహిపాల్ పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి : మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మండల కార్యాలయం వద్ద మాజీ ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి వేడుకలను నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సుంకెట రవి ఆధ్వర్యంలో వైయస్ రాజశేఖర్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు బుజ్జి మల్లయ్య, నిమ్మ రాజేంద్రప్రసాద్, సల్లూరి గణేష్ గౌడ్, సుంకెట శ్రీనివాస్, పూజారి శేఖర్, వేములవాడ జగదీష్, కొమ్ముల రవీందర్, పాలెపు నరసయ్య, సాయికుమార్, తదితరులు పాల్గొన్నారు.

నిరాహార దీక్షల కోసం ఎంఈఓకు సమగ్ర శిక్ష ఉద్యోగుల వినతి

నవతెలంగాణ-బోధన్
ప్రభుత్వం తమ ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలంటూ, తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ సోమవారం నుంచి చేపట్టబోయే రిలే నిరాహార దీక్షలకు అనుమతి ఇవ్వాలని కోరుతూ బోధన్ మండలంలోని సమగ్ర శిక్ష ఉద్యోగులు ఎంఈఓ నాగనాథ్‌కు శనివారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సోమవారం నుంచి శాంతియుతంగా రిలే నిరాహార దీక్షలను చేపడుతున్నామని తెలిపారు. మండల విద్యావనరుల కేంద్రంలో పనిచేసే సీఆర్పీలు, ఎంఐఎస్ కోఆర్డినేటర్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, మెసెంజర్లు, ఐఆర్పీలు, కేజీబీవీ ఉద్యోగులు, పీటీఐ, టీచింగ్ నాన్‌టీచింగ్ ఉద్యోగులు, జిల్లా కేంద్రంలో చేపట్టే రిలే నిరాహార దీక్షలలో పాల్గొనాలని కోరారు. కావున ప్రభుత్వం తక్షణమే స్పందించి తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని, లేనియెడల నిరసన కార్యక్రమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మండల జేఏసీ ప్రెసిడెంట్ బాబు, కోశాధికారి యూసుఫ్ అలీ, సీఆర్పీలు శివానంద్, విజయ, రేఖ, స్వర్ణలత మెసెంజర్లు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ ఉద్యోగులు రెగ్యులరైజ్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ
డిపార్ట్మెంట్ ఆఫ్ ఎంప్లాయిమెంట్ అండ్ ట్రైనింగ్ కాంట్రాక్ట్ ఉద్యోగులు తమ ఉద్యోగాలు రెగ్యులరైజ్ అయిన సందర్భంగా టి.ఎన్.జీ.ఓ. నిజామాబాద్ జిల్లా అధ్యక్షులు అలుక కిషన్‌ను, కార్యదర్శి నేతి కుంట శేఖర్‌ను మర్యాద పూర్వకంగా కలిసి సత్కరించారు. అలాగే ఈ కార్యక్రమంలో గవర్నమెంట్ ఐటీఐ నిజామాబాద్ బాయ్స్ ప్రిన్సిపల్ కోటిరెడ్డిని, గవర్నమెంట్ ఐటీఐ బిచ్కుంద ప్రిన్సిపాల్ శ్రీ శివరావును సత్కరించారు. కార్యక్రమంలో ఏటీవోల సంఘం అధ్యక్షులు ఎల్.సుధాకర్‌రెడ్డి, కార్యదర్శి వి.శ్రీనివాస్, కోశాధికారి చాంద్పాషా, ఉపాధ్యక్షురాలు అద్దంకి శ్రీదేవి, సుదర్శన్, నిజామాబాద్ జిల్లా యూనిట్ ఫోరం అధ్యక్షులు రాములు, కార్యదర్శి రాజేందర్, ఏటీవోలు తిరుపతి, శంకర్, ప్రేమ్‌దాస్, ఆలీ, సంతోష్, రాజేందర్, ఉదయ, మాధురి, సౌజన్య, సునంద తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యల పరిష్కారంపై నిరంతరం పోరాటం చేయాలి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ
జిల్లాలో నెలకొన్న విద్యారంగ సమస్యలపై నిరంతరం పోరాటం చేయాలని పి.డి.ఎస్.యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్వి శ్రీకాంత్ పిలుపునిచ్చారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలో ఎన్ఆర్ భవన్ కోటగల్లీలో పి.డి.ఎస్.యూ జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ హాజరై మాట్లాడుతూ జిల్లాలో అనేక విద్యారంగ సమస్యలు ఉన్నాయని, జిల్లాలో ప్రభుత్వ ఇంజనీరింగ్ కాలేజ్ లేదని, సంక్షేమ హాస్టల్స్‌లో మౌలిక సదుపాయాలు కల్పించాలని నూతన బిల్డింగ్స్ నిర్మించాలని, ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న ఫీజు రియంబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలని, జిల్లాలో ట్రస్ట్ భూముల కబ్జాలను అడ్డుకోవాలని, యూనివర్సిటీలో టీచింగ్, నాన్‌టీచింగ్ పోస్టులు వెంటనే భర్తీ చేయాలని, పెంచిన మెస్‌చార్జీలు అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పి.డి.ఎస్.యూ నిజామాబాద్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆర్.గౌతమ్‌కుమార్, జన్నారపు రాజేశ్వర్, జిల్లా ఉపాధ్యక్షుడు కార్తీక్, సహాయ కార్యదర్శి దేవిక, ప్రిన్స్ కోశాధికారి పవన్, జిల్లా నాయకులు సాయినాథ్, సునీల్, నిఖిల్, వంశీ, రాము, ఆకాష్, మనోజ్, లహరి తదితరులు పాల్గొన్నారు.

ఫతేపూర్‌లో పోషకాహార వారోత్సవాలు ప్రారంభం

నవతెలంగాణ-బోధన్
సాలూర మండలంలోని ఫతేపూర్ గ్రామంలో శనివారం ఐసిడిఎస్ ఆధ్వర్యంలో సూపర్వైజర్ గంగవేణి పోషకాహార వారోత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాలలో కిషోర బాలికలకు, బాలింతలకు, గర్భిణులకు అందించే పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పోషకాహార వారోత్సవాలు వారం రోజులపాటు కొనసాగుతాయని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ షేక్ అమీర్, ఉపసర్పంచ్ సావిత్రి, ఏఎన్ఎం నందకుమారి, అంగన్వాడీ కార్యకర్త భారతిబాయి పాల్గొన్నారు.

పోలీస్ అధికారులకు శిక్షణ

నవతెలంగాణ-కంఠేశ్వర్
తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ వైజయంతి జిల్లా డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ లక్ష్మీ నరసయ్య ఆదేశానుసారం నిజామాబాద్ డివిజన్ పరిధిలోని పోలీస్ అధికారులకు ఎక్సైజ్ అటవీ శాఖ అధికారులకు అదనపు పబ్లిక్ ప్రాసిక్యూషన్ రహీముద్దీన్ భూసారపు రాజేష్ గౌడ్ ఎలక్ట్రిసిటీ చట్టాలపై కోర్టులలో సాక్షులను ప్రవేశపెట్టే విధానాలను క్షుప్తంగా వివరించారు. కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ లక్ష్మీనరసయ్య, జిల్లా పబ్లిక్ ప్రాసిక్యూటర్స్ రవిరాజ్, కవితారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మి కళ్యాణ ఉత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే సతీమణి

నవతెలంగాణ-ఆర్మూర్
మండలంలోని అమ్దాపూర్ గ్రామంలో ఆగ్గు స్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన లక్ష్మీ కళ్యాణ ఉత్సవంలో ఎమ్మెల్యే సతీమణి రజితరెడ్డి శనివారం పాల్గొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మి, శ్రీనివాస్, పిప్రి ఉప సర్పంచ్ ఆసాపురం దేవి శ్రీనివాస్‌రెడ్డి, సుర్బిర్యాల సర్పంచ్ సట్లపల్లి సవిత గణేష్, ఖానాపూర్ సర్పంచ్ సింగిరెడ్డి మోహన్ తదితరులు పాల్గొన్నారు.



కల్యాణోత్సవంలో ఎమ్మెల్యే సతీమణి

ప్రజా సమస్యలు పరిష్కరించడంలో
కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి రమేష్‌బాబు

నవతెలంగాణ-బోధన్



మాట్లాడుతున్న సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి రమేష్‌బాబు

ప్రజా సమస్యలు పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి రమేష్‌బాబు విమర్శించారు. శనివారం బోధన్ పట్టణంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పార్టీ కేంద్ర కమిటీ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 1వ తేదీ నుంచి 17వ తేదీ వరకు కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్టు వివరించారు. 1వ తేదీ నుంచి 4వ తేదీ వరకు గ్రామాల వారీగా నిరసనలు తెలపడం, 7వ తేదీన మండల కేంద్రాలలో నిరసనలు, 17 తేదీన జిల్లా కేంద్రాల్లో నిరసనలు, 10వ తేదీన చిట్యాల ఐలమ్మ వర్ధంతి జరపాలని పిలుపునిచ్చినట్టు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం పెంచిన పెట్రోల్, డీజిల్, గ్యాస్, నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలని, అలాగే 2019 ఎన్నికల్లో ఇచ్చిన హామీలు సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు, విదేశాల్లో నల్ల డబ్బులు తెచ్చే హామీ ప్రకారం కుటుంబానికి 15 లక్షలు ఇవ్వాలని, అలాగే ప్రతి కుటుంబానికి ఇంటి నిర్మాణం కోసం రూ.5లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు పూర్తిస్థాయిలో అమలు చేయడం లేదని అన్నారు. నిరుపేదలకు ఇంటి పట్టాలు ఇవ్వలేదని, డబుల్ బెడ్ రూములు చాలా మందికి ఇవ్వలేదని, మూడెకరాల భూమి దళితులందరికీ ఇస్తామని కొంతమందికిచ్చి మిగతా వారికి పక్కన పెట్టేశారన్నారు. బీసీ బంధు పేరు మీద కొన్ని కులాలకు ఇచ్చి మిగతా కులాలకు ఇవ్వడం లేదని, కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వడం లేదని, నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వడంలో వైఫల్యం చెందిందన్నారు. సమావేశంలో సీపీఐ(ఎం) బోధన్ నియోజకవర్గ ఏరియా కమిటీ కార్యదర్శి ఏశాల గంగాధర్, బోధన్ ఏరియా కార్యదర్శివర్గ సభ్యులు జే శంకర్‌గౌడ్, జంగం గంగాధర్, సంఘం గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ టీచర్లను, ఆయాలను పర్మినెంట్ చేయాలి

- సీఐటీయూ జిల్లా అధ్యక్షులు శంకర్ గౌడ్

నవతెలంగాణ-బోధన్
అంగన్వాడీ టీచర్లను, ఆయాలను ప్రభుత్వం పర్మినెంట్ చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు శంకర్ గౌడ్ డిమాండ్ చేశారు. శనివారం సీఐటీయూ ఆధ్వర్యంలో బోధన్ సీడీపీఓ కార్యాలయంలో కార్యాలయ ఉద్యోగి అర్జున్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా శంకర్‌గౌడ్ మాట్లాడుతూ గత 30 సంవత్సరాలుగా అంగన్వాడీ కార్మికులు ప్రభుత్వం తరపున ప్రజలకు సేవ చేస్తున్నారని అన్నారు. తెలంగాణ రాష్ట్రం వస్తే తమ భవిష్యత్తు మారుతుందని భావించి బీఆర్ఎస్ పార్టీని రెండుసార్లు అధికారంలో కూర్చోబెట్టారని అన్నారు. కెసిఆర్ బంగారు తెలంగాణ సాధనలో కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ విధానాలను రద్దుచేసి వారిని పర్మినెంట్ చేస్తానని హామీ ఇచ్చారని ఇచ్చిన హామీని అమలు చేయకుండా ఎన్నికలకు పోవడం సరైన విధానం కాదని అన్నారు. కార్మికుల జీవితాలు మారకుండా బంగారు తెలంగాణ ఎలా సాధ్యమవుతుందని ప్రశ్నించారు. ఇప్పటికైనా సీఎం కేసీఆర్ అంగన్వాడీ టీచర్లను, ఆయాలను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే కనీస వేతనం రూ.26,000వేలు ఇవ్వాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ టీచర్‌కు రూ.5,00000, ఆయాలకు రూ.300000లక్షలు ఇవ్వాలని, జీతంలో సగభాగాన్ని పెన్షన్ రూపంలో చెల్లించాలని, అలాగే చనిపోయిన అంగన్వాడీలకు అంత్యక్రియలకు రూ. 50వేలు ఇవ్వాలని, వారసత్వ ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, మినీ అంగన్వాడీ సెంటర్లన్నింటినీ మెయిన్ సెంటర్లుగా చేయాలని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం అంగన్వాడీ ఉద్యోగులకు వెంటనే గ్రాడ్యుటీ చెల్లించాలని, హెల్త్ కార్డులు ఇవ్వాలని, వేసవి కాలంలో పాఠశాలలతో సమానంగా వేసవి సెలవులు ఇవ్వాలని కోరారు. న్యాయమైన అంగన్వాడీ ఉద్యోగుల డిమాండ్ల సాధనకై సెప్టెంబర్ 11 నుంచి సమ్మెకు వెళ్తున్నట్టు బోధన్ సిడిపిఓ ఆఫీస్‌లో సమ్మె నోటీసు అందజేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు రమేష్‌బాబు, జిల్లా కమిటీ సభ్యులు జంగం గంగాధర్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు గంగాధర్, ప్రాజెక్ట్ అధ్యక్షులు మంగ, కార్యదర్శి విక్టోరియా రాణి, సహాయ కార్యదర్శి లావణ్య, అనీస్, ఉపాధ్యక్షులు పద్మ, సునీత తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రాన్ని అందజేస్తున్న నాయకులు

ఆలోచనే.. ఉపాధి

- బైక్‌పైనే పంక్చర్ షాప్

నవతెలంగాణ-వర్ని
ఇతర ప్రాంతాలకు వెళ్లే సమయంలో వాహనాలు పంక్చర్ అయితే.. బండి కదలలేని పరిస్థితి. చుట్టుపక్కల పంక్చర్ షాప్ ఎక్కడ ఉంటుందో తెలియని పరిస్థితి. అలాంటి వారికి అందుబాటులో ఉండేందుకు వచ్చిన ఆలోచనతో ఓ యువకుడు ఉపాధి పొందుతున్నాడు. మండలంలోని నెహ్రూ నగర్ గ్రామానికి చెందిన కోర్వ రాజు అనే యువకుడు.. చుట్టుపక్కల ప్రాంతాలకు సైతం వెళ్లి పంక్చర్ చేస్తూ అటు వాహన దారులకు సౌకర్యం కల్పిస్తూ.. తాను ఉపాధి పొందుతున్నాడు.

రాజు మొదట ట్రాక్టర్ డ్రైవర్‌గా ఒక భూస్వామి వద్ద పని చేసేవాడు. తనకు ఇతరుల వద్ద పని చేయకుండా ఉండాలనే ఆలోచనతో ఈ మొబైల్ పంక్చర్ దుకాణాన్ని ఏర్పాటు చేశాడు. తన బైక్‌కే గాలి కొట్టె యంత్రం పలు పనిముట్లను రూ.30 వేల రూపాయలు ఖర్చు చేసి సమకూర్చుకున్నాడు. దూర ప్రయాణాలకు వెళ్లే వారి వాహనాలకు పంక్చర్ అయినా.. గాలి దిగిపోయినా బండి రిపేర్ అయినా వెంటనే మొబైల్‌బైక్ రాజుకు ఫోన్ రావా ల్సిందే. వాహనదారులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ తాను ఉపాధి పొందుతున్న రాజును స్థానికులు అభినందిస్తున్నారు.



బైక్‌పై పరికరాలతో పంక్చర్ వేస్తున్న రాజు

మైనారిటీ బాలికల కళాశాలలో షీటీంపై అవగాహనా సదస్సు



షీటీం కరపత్రాలను ఆవిష్కరిస్తున్న దృశ్యం

నవతెలంగాణ-ఆర్మూర్
తెలంగాణ రెసిడెన్షియల్ స్కూల్ అండ్ కాలేజ్ ఆర్మూర్ గర్ల్స్ 1లో షీటీంపై అవగాహన సదస్సు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా షీ టీం కానిస్టేబుళ్లు, విగ్నేష్, సుమతి మాట్లాడుతూ.. ఎవరైనా మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన, ఈవ్ టీజింగ్ చేసిన షీ టీంకు సమాచారం ఇవ్వాలని అన్నారు. విద్యార్థినిలు, ఉద్యోగినిలు, మహిళలు, ఈవ్‌టీజింగ్, వేధింపులకు గురైతే పోలీస్ శాఖ ఏర్పాటు చేసిన షీటీంకు సమాచారం ఇవ్వాలన్నారు. సమాచారం ఇచ్చిన మహిళలు, విద్యార్థినిల పేర్లు గోప్యంగా ఉంచనున్నట్టు తెలిపారు. ఈవ్ టీజింగ్‌కు గురయ్యేవారు భయపడకుండా సమాచారం ఇస్తే రక్షణ కల్పిస్తామన్నారు. షీటీం నెంబర్ 8712659795కు, డయల్ 100కు సమాచారం ఇవ్వాలని సూచించారు. క్యూ ఆర్ కోడ్ ద్వారా షీ టీం వారికి ఫిర్యాదు చేసే విధానాన్ని మహిళలకు వివరించారు. అనంతరం షీటీం కరపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, నహీదా ఫిరోజ్, అధ్యాపకులు, విద్యార్థినీలు సుమారు 250 నుంచి 300 ల మంది పాల్గొన్నారు.

మదన్ మోహన్ మెగా జాబ్ మేళాకు అనూహ్య స్పందన..

నవతెలంగాణ-ఎల్లారెడ్డి
ఎల్లారెడ్డి నియోజకవర్గ నిరుద్యోగ యువతకు ఉపాధి కొరకు శనివారం మదన్ మోహన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా జాబ్ మేళాకు మంచి స్పందన వచ్చింది. ఈ జాబ్ మేళాలో వివిధ రంగాలలో ప్రత్యేకత గాంచిన మల్టీ నేషనల్ కంపనీలు (రిలైన్స్, టాటా, ముతూట్ ఫైనాన్స్, మెడ్ ప్లస్ ఫార్మా వెట్రో టెక్ సాఫ్ట్వేర్, భీమా జవెల్లెర్స్)లి 30 పై కంపనీలు పాల్గొన్నాయి. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని ఆయా మండలాలకు చెందిన నిరుద్యోగ యువత వేలాదిగా జాబ్ మేళాలో పాల్గొన్నారు. ఈ జాబ్‌మేళాలో ఆయా కంపెనీలకు ఎంపికైన నిరుద్యోగులు మల్టీ నేషనల్ కంపెనీలో ఉద్యోగ అవకాశాలు, స్పాట్ ఆఫర్ లెటర్ సదుపాయం కలిపించిన మదన్‌మోహన్‌కు, ముఖ్యంగా మదన్‌మోహన్ ట్రస్ట్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆరిఫ్, యూత్ కాంగ్రెస్ నాయకులు అజార్ ఖాద్రి, ఎంవైఎఫ్ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
కామారెడ్డి
ఆదివారం | సెప్టెంబర్ 03, 2023 | www.navatelangana.com

ఆలయ అభివృద్ధికి భక్తుల విరాళం

నవతెలంగాణ-భిక్కనూర్

మండల కేంద్రంలోని దక్షిణ కాశీ శ్రీ సిద్ధ రామేశ్వర ఆలయ అభివృద్ధికి హైదరాబాద్ పట్టణానికి చెందిన అశోక్, లలిత దంపతులు 10 వేల రూపాయల విరాళాన్ని అందజేశారు. విరాళం అందజేసిన భక్తులను శాలువాతో సత్కరించి స్వామివారి ప్రతిమను, తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ పునర్నిర్మాణ కమిటీ చైర్మన్ మహేందర్ రెడ్డి, అర్చకులు సిద్ధగిరి శర్మ, ఆలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



విరాళం అందజేసిన దాతలు

సబ్‌స్టేషన్ ఎదుట రైతుల ధర్నా

నవతెలంగాణ-భిక్కనూర్

భిక్కనూర్ మండలంలోని భగిర్థిపల్లి గ్రామంలో వ్యవసాయ బావులకు 3 ఫేస్ కరెంటు ఇవ్వాలని రైతులు గ్రామంలోని విద్యుత్ సబ్ స్టేషన్ ముందు శనివారం ధర్నా నిర్వహించారు. 3 ఫేస్ కరెంటు లేని కారణంగా పొలాలకు నీరు అందించలేక పంటలు ఎండిపోతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యుత్ కోతల పై ఏ.ఈ సంకీర్త్ వివరణ కోరగా జన్ కొ లో అధిక విద్యుత్ వినియోగం కారణంగా కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా 3 ఫేస్ కరెంట్ కొరత ఉందని త్వరలోనే సమస్య పరిష్కరించి రైతులకు 3 ఫేస్ కరెంటు అందించడం జరుగుతుందని తెలిపారు. విద్యుత్ అధికారులకు రైతులు సహకరించాలని కోరారు.



సబ్‌స్టేషన్ ఎదుట రైతుల నిరసన

అర్హులందరికీ ఓటు హక్కు కల్పించడంలో

బూత్‌స్థాయి అధికారుల చొరవే కీలకం

- కలెక్టర్ జితేశ్ వి పాటిల్

నవతెలంగాణ-తాడ్వాయి/లింగంపేట్

అర్హులైన ప్రతి ఒక్కరు ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకునేలా బూత్ స్థాయి అధికారులు చొరవ చూపాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. ఓటరు నమోదు ప్రత్యేక డ్రైవ్ కార్యక్రమంలో భాగంగా శనివారం తాడ్వాయి మండలం కృష్ణాజివాడి లోని 106, 107, , తాడ్వాయి లోని 108,109 లింగంపేట్‌లోని వివిధ పోలింగ్ బూతులను ఆకస్మికంగా సందర్శించి నిర్వహణ తీరుతెన్నులను పరిశీలించారు. బి.ఎల్.ఓ.ల వద్ద ముసాయిదా ఓటరు జాబితా, అవసరం మేర ఫారం-6,7,8 అందుబాటులో ఉన్నాయా అని పరిశీలించారు. ఈ సందర్భముగా ఓటరు నమోదుకు, మార్పులు, చేర్పులు, తొలగింపులకు వస్తున్న దరఖాస్తులను పరిశీలించారు. ఆదివారం కూడా ప్రత్యేక శిబిరాలు అన్ని పోలింగ్ బూతులలో కొనసాగుతాయని, ఓటర్లు ముసాయిదా ఓటరు జాబితాలో తమ పేరు ఉన్నది, లేనిది పరిశీలించుకోవాలన్నారు. లేనివారు వెంటనే ఫారం-6 ద్వారా ఓటరు నమోదుకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివిధ రాజకీయ పార్టీలు కూడా బూతు స్థాయిలో ఉన్న ఓటర్ల జాబితాను పరిశీలించి ప్రముఖుల పేర్లు మిస్ కాకుండా చూసుకోవాలన్నారు. మార్పులు, చేర్పులు, తొలగింపులు ఏమైనా ఉంటె బూత్ స్థాయి అధికారులకు తెలపాలన్నారు. ఈ నెల 19 వరకు ఓటరు నమోదు తో పాటు మార్పులు,చేర్పులకు అవకాశం ఉంటుందని, 18-19 ఏళ్ళు నిండిన మహిళలు ఓటరుగా నమోదు చేసుకోవడంలో అవగాహన కలిగించాలన్నారు. ఎన్నికల కమిషన్ నిర్దేశించిన మేర జనాభా, ఓటరు నిష్పత్తి, లింగ నిష్పత్తి ఉండే విధంగా చూడాలని అన్నారు. ప్రత్యేక శిబిరాల అనంతరం బూతు స్థాయి అధికారులు,సూపర్వైజర్లు ఇంటింటా సర్వే చేపట్టి అర్హత గల ఏ ఒక్క ఓటరు మిగిలిపోకుండా ఓటరుగా నమోదయ్యేలా చూడాలన్నారు.ఓటర్ టర్న్ అవుట్ తక్కువగా ఉన్న చోట ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలన్నారు. ఓటరు జాబితాలో పేర్లు తొలగించే విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని, మృతి చెందిన వారి మరణ ధ్రువీకరణ పత్రాన్ని కుటుంబ సభ్యుల నుండి సేకరించి క్షుణ్ణంగా పరిశీలించాలని అన్నారు. డూప్లికేట్ ఓటర్ల తొలగింపు, ఒక నియోజక వర్గం నుండి మరో నియోజకవర్గానికి మార్పు, శాశ్వతంగా చిరునామా మార్పు, ఒకే ఇంట్లోని వారందరు ఒకే పోలింగ్ బూత్‌లో ఓటర్లుగా ఉండేలా చూడాలన్నారు. వివిధ కారణాల వల్ల ఎక్కడైనా పోలింగ్ కేంద్రాలు మారినట్లైతే, ఈ విషయాన్ని క్షేత్రస్థాయిలో ఓటర్లకు తెలియజేయాలని, తద్వారా వారు పోలింగ్ సమయంలో గందరగోళానికి గురికాకుండా ఓటు హక్కును వినియోగించుకోగలుగుతారని కలెక్టర్ అన్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు ఎంతో విలువైనదని, , ఓటరుగా నమోదయిన ప్రతి ఒక్కరు ఎన్నికలలో తప్పనిసరిగా ఓటు హక్కు వినియోగిం చుకునేలా అవగాహన కలిగించాలని సూచించారు. గత నెల 26, 27 తేదీలలో చేపట్టిన స్పెషల్ డ్రైవ్ లో వచ్చిన అభ్యంతరాలు, ఆక్షేపణలను, నేడు, రేపు నిర్వహిస్తున్న ప్రత్యేక డ్రైవ్‌లో వచ్చే దరఖాస్తులను పరిశీలించి ఈ నెల 28 లోగా పరిష్కరించి అక్టోబర్ 4 న తప్పులు లేని, పారదర్శకమైన తుది ఓటరు జాబితా విడుదలచేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో తాడ్వాయి తహశీల్దార్ సునీత, నాయబ్ సాహసిల్దార్ వెంక టేష్ తదితరులు పాల్గొన్నారు.





తాడ్వాయి, లింగంపేట్ మండలాల్లో పలు పోలింగ్ బూత్ కేంద్రాల్లో కొనసాగుతున్న ఓటరు నమోదు,మార్పులు చేర్పుల డ్రైవ్‌ను పరిశీలిస్తూ సిబ్బందికి సూచనలిస్తున్న కలెక్టర్

ఇక నిరంతర తనిఖీ

- రాష్ట్ర సరిహద్దులో చెక్‌పోస్టు ఏర్పాటు



సరిహద్దులో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు

నవతెలంగాణ-మద్నూర్

త్వరలో రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ఆదేశాల మేరకు రాష్ట్ర సరిహద్దు మద్నూర్ మండలం సలాబత్‌పూర్‌లో శనివారం అంతర్రాష్ట్ర తనిఖీ చెక్‌పోస్టును రెవెన్యూ శాఖ పోలీస్ శాఖ ఎక్సైజ్ శాఖ వాణిజ్య పన్నుల శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఎన్నికలు పూర్తయ్యే వరకూ రాష్ట్ర సరిహద్దులో పకడ్బందీ తనిఖీలు చేపట్టనున్నట్టు ఆయా శాఖల అధికారులు తెలిపారు. ఈ చెక్ పోస్ట్ ఏర్పాటు కార్యక్రమంలో మండల తాసిల్దార్ ముజీబ్ ఆర్ఐ శంకర్ ఎస్సై కృష్ణారెడ్డి వీరితో పాటు ఎక్సైజ్ శాఖ వాణిజ్య పన్నుల శాఖ అధికారులు పాల్గొన్నారు

'అభిచువల్' డ్రగ్స్ విక్రయిస్తే కేసులు



మెడికల్ దుకాణాల్లో తనిఖీలు చేపట్టిన డ్రగ్ ఇన్స్‌పెక్టర్ రాజారెడ్డి

నవతెలంగాణ-భిక్కనూర్

అభిచువల్ డ్రగ్స్ విక్రయిస్తే కేసు నమోదు చేస్తామని డ్రగ్ ఇన్స్‌పెక్టర్ రాజారెడ్డి హెచ్చరించారు. శనివారం మండల కేంద్రంలో పలు మెడికల్ దుకాణాలలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. మత్తుమందు మాత్రలు, నిషేధిత డ్రగ్స్ మాత్రలు విక్రయించరాదని మెడికల్ దుకాణాదారులకు సూచించారు. మెడికల్ షాపులోని మందులను, రికార్డులను పరిశీలించారు. అనుమతి లేని మందులు విక్రయిస్తే మెడికల్ షాపులు సీజ్ చేసి, కేసు నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు.

వైఎస్సార్‌కు వర్ధంతి నివాళి



వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న నాయకులు

నవతెలంగాణ-భిక్కనూర్

భిక్నూర్ మండల కేంద్రంలో మాజీ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి స్వర్గీయ వైయస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం టి పి సి సి రాష్ట్ర కార్యదర్శి ఇంద్రకరణ్ రెడ్డి, డిసిసి జిల్లా ఉపాధ్యక్షులు చంద్రకాంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు భీం రెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ఉన్న సమయంలో రాష్ట్రానికి చేసిన సేవలు గురించి, బడుగు బలహీన వర్గాలకు అందించిన పథకాల గురించి కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాజీ డిసిసిబి చైర్మన్ ఎడ్ల రాజి రెడ్డి, పట్టణ అధ్యక్షులు దయాకర్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు సుదర్శన్, కంచర్ల ఎంపిటిసి మోహన్ రెడ్డి, సీనియర్ నాయకులు సుధాకర్ రెడ్డి, మోహన్ రెడ్డి, లింబాద్రి, సిద్ధ గౌడ్, ఆంజనేయులు, శ్రీనివాస్ రెడ్డి, ప్రవీణ్ రెడ్డి, కిరణ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పెసర కోతలు షురూ



కోతలు కోసేందుకు తెల్లవారుజామునే వెళ్తున్న కూలీలు

నవతెలంగాణ-మద్నూర్

వానాకాలం పంట సాగులో భాగంగా పెసర పంట కోతకు వచ్చింది. పెసర పంటకు గత కొన్ని సంవత్సరాల కాలంగా అధిక వర్షాలు దెబ్బతీస్తున్నాయి. ఈ ఏడాది కూడా అధిక వర్షాలు కురియడంతో పెసర పంట పూర్తిగా దెబ్బతిన్నట్లు రైతుల్లో ఆందోళన వ్యక్తం అవుతుంది. ఎకరాకు మూడు నుండి నాలుగు క్వింటాళ్ల పంట దిగుబడి రావాల్సి ఉండగా ఈ ఏడాది రెండు క్వింటాళ్లలోపే దిగుబడి వస్తున్నట్లు వ్యవసాయ రైతులు చర్చించుకుంటున్నారు. పెసర పంట కోతకు రాగానే పెసర సుగ్గి అంటారు. ఈ పంట కోసం కూలీలు తెల్లవారుజామునే చేనుల్లోకి బయలుదేరుతారు. శనివారం నాడు పెసర పంట కోతకు కూలీలు తెల్లవారుజామున నుండే బయలుదేరడం కనిపించింది. పంట దిగుబడి తక్కువ కూలీలకు సరైన కూలీ పడటం లేదని రైతులు పంట కోతకు ఐదు ఆరు పాళ్లు పెట్టి కూలీలకు ఒక పాళ్ల ఇస్తున్నట్లు దినమంత పని చేస్తే ఒక మానెడు కూడా రావడం లేదని కూలీల్లో ఆవేదన వ్యక్తం అవుతుంది. పెసర పంట కోతకు రాగానే కూలీలు ఉదయం నుండే చేనుల్లోకి బారులు తీరారు. ఎందుకంటే పంట కోతలు చాలా కష్టాలు ఉంటాయి. ముందుగా కోత పెట్టుకొని మధ్యాహ్నం తర్వాత దానిని కట్టెలతో రాసులు చేస్తారు. రైతన్నకు దిగుబడి తక్కువ కూలీలకు మానేడు పంట కూడా రోజు వారి కూలీలు పడడం లేక అటు రైతన్న ఇటు కూలీలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏది ఏమైనా పెసర పంట కోత సుగ్గి ప్రారంభమైందంటే పంట కోతల కోసం కూలీలంతా తెల్లవారుజామున నుండే చేనుల్లోకి బయలుదేరుతారు.

బస్వాపూర్‌లో ఉచిత వైద్య శిబిరం



మందులు అందజేత

నవతెలంగాణ-భిక్కనూర్

భిక్కనూర్ మండలంలోని బస్వాపూర్ గ్రామంలో శనివారం శ్రీరంగ ఎడ్యుకేషనల్ అండ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత ఆరోగ్య, కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలు కంటి సమస్యలు, అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి చికిత్స నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మంజుల మల్లారెడ్డి, ఉప సర్పంచ్ బిక్షపతి, ఎంపీటీసీ లీలావతి బాలా గౌడ్, చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు సోహిల్ సాయి శ్రీరంగం, వాడు సభ్యులు, ప్రజా ప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కిసాన్ మోర్చా రైతు సంఘాల

సదస్సు విజయవంతం చేయండి

- తెలంగాణ రైతు సంఘం

నవతెలంగాణ-గాంధారి

ఈ నెల 5వ తేదీనా నిర్వహించనున్న కిసాన్ మోర్చా రైతు సంఘాల సదస్సు విజయవంతం చేయాలని రైతు సంఘం జిల్లా నాయకులు మోతీరం నాయక్ పిలుపునిచ్చారు. గాంధారి మండల కేంద్రంలో శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ నెల 5 తేదీ మంగళవారం ఉదయం 10 గంటలకు కర్షక బీఎడ్ కాలేజీలో (కామారెడ్డి) ఎస్కేయం స్వయంత కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో రైతు సంఘాల సదస్సు నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ సదస్సుకు రాష్ట్ర నాయకులు శోభన్, అలాగే పశ పద్మ హాజరుకానున్నట్టు తెలిపారు. 'దేశంలలో రైతు సమస్యలను పక్కనపెట్టి ఆదాని అంబానీ గురించే తపన పడుతున్నారే తప్పా.. రైతంగ సమస్యను పక్కన పెట్టారు. మద్దతు ధర లేక రైతులు నష్టపోతున్నాడు. నిత్యావసర ధరలు పెంచి రైతులకు కూలిగా మార్చేశాడు. మూడు నల్ల చట్టాలను తీసుకువచ్చి రైతులపై భారాలు మోపుతున్నారు. రైతులు దివాలా తీసి ఆత్మహత్యకు పాల్పడుతున్నా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదు. కులాల మధ్య చిచ్చులు పెట్టి రాజకీయ లబ్ధి పొందడం కోసం అక్కడ ఆదిలాబాద్‌లో ఇక్కడ కామారెడ్డిలో ముఠా నాయకులను తయారుచేసి కులాల మధ్య చిచ్చులేపుతా ఉన్నారు. రైతు సమస్యలు పక్కదారి పట్టియ్యడానికి కుల సమస్యల్ని పావులుగా వాడుకుంటున్నారు. రైతులు కూలీలు ఐక్యతమై మోసం చేసే పాలకులపై పోరాడుదామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు కమ్మరి సాయిలు, కామెల్లి రాములు, ప్రకాష్, కామెల్లి రాములు, మధు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మోతీరాం నాయక్

మరుగుదొడ్లు నిర్మించండి..

నవతెలంగాణ-మద్నూర్

మద్నూర్ మండల కేంద్రంలో గల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు మౌలిక సదుపాయాలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారని ఎంఎస్‌యు రాష్ట్ర నాయకులు బాలు యాదవ్ పేర్కొన్నారు. కనీసం మరుగుదొడ్లు సైతం లేకపోవడంతో ముఖ్యంగా విద్యార్థినులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని, దీంతో అనారోగ్య సమస్యలకు గురై కాలేజీకి బందు పెట్టాల్సిన పరిస్థితి ఏర్పడిందని, వెంటనే మరుగుదొడ్లు నిర్మించాలని శనివారం ఆయన ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. మద్నూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల పట్ల జుక్కల్ ఎమ్మెల్యే హనుమంతు షిండే వెంటనే స్పందించి సమస్యలు తీర్చాలని లేకుంటే విద్యార్థులతో కలిసి ఎమ్మెల్యే ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించారు.కళాశాలలో దాదాపు 250 మంది వరకు విద్యార్థిని విద్యార్థులు చదువుకుంటున్నారని పెద్ద పిల్లల చదువుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం సరైంది కాదని కళాశాల సమస్యలపై ఉద్యమిస్తామని తెలిపారు.



వినియోగించేందుకు వీలులేకుండా మారిన మరుగుదొడ్లు

అంగన్‌వాడీల్లో పోషకాహార దినోత్సవం

నవతెలంగాణ-జుక్కల్

మండలంలోని పెద్దగుల్లా గ్రామంలోని మూడు అంగన్‌వాడి కేంద్రాలలో సంయుక్తంగా కలిసి శనివారం పోకాహార దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సంధర్భంగా స్థానిక సర్పంచ్ రుక్మినిబాయి పటేల్ ముఖ్యఅథిగా పాల్గొన్నారు. మూడు అంగన్ వాడి టీచర్లు సునిత, లతాతాయి, భూమాబాయి మాట్లాడుతు గర్భిణి , బాలింతలు , కిషోర బాలీకలు, పిల్లలు రక్తహీనత గురికాకుండా అన్ని పోషకాలు ఉన్న ఆహరం తీసుకోవాలని అన్నారు. అందుబాటులో ఉండే అన్ని రకాల ఆకుకూరలు , పాలు , గుడ్లు , పల్లీలు, నువ్వులు , బెల్లం, నిత్యం తీసుకోవాలని సూచించారు. గర్భిణి ప్రసవం అయ్యేవరకు కనీసం తొమ్మిది మాసాలలో వంద ఐరన్ మాత్రలు తప్పక వేసుకోవాలని తెలిపారు. గర్భిణి అని తెలిసిన నాటి నుండి తనకోసం తనబిడ్డ కోసం అదనపు ఆహరం తీసుకోవాలని, ప్రసవం అయ్యేవరకు పది నుండి, పన్నెండు కిలోల బరువు పెరగాలని అన్నారు. అనంతరం అక్షరబ్యాసం, అన్నప్రాసానం చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు సబ్యులు , తల్లులు, కిషోర బాలీకలు, తదితరులు పాల్గోన్నారు.



పిల్లలకు పోషకాహారం అందజేత

తక్షణమే మెగా డీఎస్సీ ప్రకటించాలి

- మాజీ ఎమ్మెల్యే గంగారాం

నవతెలంగాణ-పిట్లం

తక్షణమే మెగా డీఎస్సీ ప్రకటించాలని మాజీ ఎమ్మెల్యే గంగారం డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఎన్ఎస్‌యూఐ అధ్యక్షులు రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన దీక్షలో పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో 25 వేలతో మెగా డీఎస్సీని ప్రకటించి, ప్రమోషన్ల ఖాళీలను చూపించి ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్ ఖాళీలను వెంటనే ప్రకటించాలన్నారు. ప్రభుత్వ విద్యా వ్యవస్థను ప్రైవేట్‌కు దీటుగా బలోపేతం చేసి స్టూడెంట్ రేషియో కాకుండా సబ్జెక్టుల రిషియో ప్రకారం ఖాళీలను భర్తీ చేయాలన్నారు. తెలంగాణ రాష్ట్రం కోసం 1200 మంది విద్యార్థులు ఆత్మ బలిదానం చేసుకున్నారని గుర్తు చేశారు. విద్యార్థుల ఆత్మ బలిదానాలను ఆపాలని ఉద్దేశంతో కాంగ్రెస్ పార్టీ అధినేత సోనియా గాంధీ తెలంగాణ ఇచ్చారన్నారు. తెలంగాణ ఆవిర్భావం అనంతరం కెసిఆర్ ముఖ్యమంత్రి పదవి దళితులకు ఇస్తానని మోసం చేశారన్నారు. దళితులకు మూడు ఎకరాల భూమి, ప్రతి ఇంటికి ఉద్యోగం , డబుల్ బెడ్ రూమ్ హామీలతో అధికారం లోకి వచ్చిన బిఆర్ఎస్ పార్టీ ఇచ్చిన హామీలను విస్మరించారన్నారు. నిజాంసాగర్ మండలంలో 10 , 20 శాతం మంది దళితులకు దళిత బంధు ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ నాయకులు సౌధాగర్ అరవింద్ , మండల సీనియర్ నాయకులు రాం రెడ్డి (అడ్వకేట్), మండల పార్టీ అధ్యక్షులు జంబిగే హన్మాండ్లు , టౌన్ అధ్యక్షులు చిప్ప శివ, కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్ లీడర్ బోడ్ల రాజు, మా రెడ్డి కిష్టారెడ్డి, రవీందర్ నాయక్, నీలబోయిన ప్రవీణ్ , మల్లెపల్లి సంతోష్ రెడ్డి , గుర్రపు పండరి, మద్దెల్ చెరువు గంగారాం , కార్యకర్తలు , శ్రేయోభిలాషులు శ్రేయోభిలాషులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గంగారాం

అభివృద్ధికి దిక్సూచి వైఎస్ఆర్



నివాళి అర్పిస్తున్న నాయకులు

నవతెలంగాణ-లింగంపేట్

మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శనివారం వైఎస్ఆర్‌కు వర్ధంతి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా రఫియొద్దిన్ మాట్లాడుతూ అర్హతే ప్రామాణికంగా సంక్షేమ ఫలాలను అందించిన మానవతామూర్తి ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ ముఖ్య మంత్రి గా ప్రమాణ స్వీకారం చేసిన వేదికపైనే ఉచిత విద్యుత్ ఫైలుపై తొలి సంతకం చేసిన రైతు బాంధవుడు వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మైనార్టీ ప్రధాన కార్యదర్శి రఫియొద్దిన్ సీనియర్ నాయకులూ ఆరిఫ్ జొన్నల రాజు అల్లూరి సర్దార్ ఇమామ్ గులాం శ్రీరాం మదన్మోహన్ యొత్ పోర్స్ నాయకులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ

నవతెలంగాణ-పిట్లం

మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన 54 మంది లబ్దిదారులకు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఎంపీపీ కవిత విజయ్, జడ్పిటిసి శ్రీనివాస్‌రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదింటి ఆడబిడ్డల పెండ్లితో కుటుంబాలకు భారం కావద్దనే ఉద్దేశంతో రాష్ట్ర సీఎం కేసీఆర్ కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను ప్రవేశపెట్టి లక్ష 116 రూపాయలను అందజేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటేశ్వర్లు , ఆయా గ్రామాల సర్పంచులు, నాయకులు పాల్గొన్నారు.

13న మండల సాధారణ సర్వసభ్య సమావేశం

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

ఈనెల 13వ తేదీన కమ్మర్‌పల్లి మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో సంతోష్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ అధ్యక్షురాలు గౌతమి అధ్యక్షతన ఉదయం 11గంటలకు మండల పరిషత్ కార్యాలయ సమావేశం మందిరంలో నిర్వహించే సాధారణ సర్వసభ్య సమావేశానికి ఆయా గ్రామాల ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, కోఆప్షన్ సభ్యులు సకాలంలో హాజరు కావాలని ఆయన కోరారు. మండల స్థాయి అధికారులు తమ తమ శాఖలకు సంబంధించిన అభివృద్ధి నివేదికల జిరాక్స్ ప్రతులను ఈనెల 8వ తేదీలోగా మండల పరిషత్ కార్యాలయంలో అందజేయాలని కోరారు.

సోయాబీన్ పంటకు తెల్ల దోమ

నవతెలంగాణ-రెంజల్

మండల కేంద్రంలోని రెంజల్ శివారులో సోయపంటకు తెల్ల దోమ సోకిందని వ్యవసాయ విస్తీర్ణ అధికారి ప్రసాద్ పేర్కొన్నారు. శనివారం పంటను ఆయన పరిశీలించారు. సోయ పంటలో పల్లాకు తెగుళ్ల గమనించడం జరిగిందని, దీని నివారణకు ఏసిపెట్ 300ల గ్రాములు ఎకరానికి పిచికారీ చేయాలని ఆయన సూచించారు. ఆయన వెంట రైతు అమీనుద్దీన్ ఉన్నారు.


పంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి

రెండో విడత గొర్రె యూనిట్ల పంపిణీ


గొర్రెలు పంపిణీ చేస్తున్న దృశ్యం

నవతెలంగాణ-వేల్పూర్

మండలంలోని వాడి గ్రామానికి చెందిన లబ్దిదారులకు 12 యూనిట్ల గొర్రెలను సర్పంచ్ గోపు మహేష్ శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లబ్దిదారులు రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్, రాష్ట్ర మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డికి హృదయపూర్వక అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో పశు వైద్యాధికారి సంతోష్, ఎంపీటీసీ సభ్యుడు, బీఆర్ఎస్ నాయకులు, గొర్రెలు మేకల లబ్దిదారులు తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు వరం


సహాయనిధి చెక్కులు అందజేస్తున్న సర్పంచ్

నవతెలంగాణ-సిరికొండ

ఆసుపత్రిలో వైద్యం చేయించుకునే స్థితిలో లేని నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి గొప్ప వరమని కొండాపూర్ సర్పంచ్ పోడేండ్ల రమేష్ అన్నారు. శనివారం కొండాపూర్ గ్రామానికి చెందిన బోదాస్ బాల కిషన్‌కు రూ.14000, మొగిలి పెద్ద లింబయ్యకు రూ.18000, ఓరగంట పద్మకు రూ.12000 ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు అందజేశారు. రూరల్ ఎమ్మెల్యే, టీఎస్ ఆర్టీసీ చైర్మెన్ బాజిరెడ్డి గోవర్ధన్, ధర్పల్లి జడ్పీటీసీ, లైక్వాండో రాష్ట్ర ఉపాధ్యక్షులు, ఒలింపిక్ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బాజిరెడ్డి జగన్ సహకారంతో చెక్కులు మంజూరు చేసినందుకు కొండాపూర్ గ్రామం తరపున ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ రమేష్, ఎంపీటీసీ బుల్లి చందర్, సొసైటీ వైస్ చెర్మెన్ అబ్బాస్, బిఆర్ఎస్ మండల జనరల్ సెక్రటరీ రాజేశ్వర్ గౌడ్, మండల యూత్ వైస్ ప్రెసిడెంట్ జగన్, గ్రామ యూత్ అధ్యక్షుడు నర్సయ్య, గ్రామ వైస్ ప్రెసిడెంట్ వెంకట్, యూత్ సభ్యులు అక్షయ్, రాములు, రామవ్వ, బాల్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

సత్ఫలితాలిస్తున్న షీటీమ్

- ఇంచార్జీ పోలీస్ కమీషనర్ వెల్లడి

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ లో షీ టీం సత్ఫలితాలను ఇస్తుందని ఇన్చార్జి పోలీస్ కమిషనర్ ప్రవీణ్ కుమార్ వెల్లడించారు. ఎవరైనా ఆకతాయిలు విద్యార్థులను, మహిళలను వేధింపులకు గురిచేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని నిజామాబాద్ ఇంచార్జీ పోలీస్ కమిషనర్ సి.హెచ్.ప్రవీణ్‌కుమార్ శనివారం పేర్కొన్నారు. నిజామాబాద్ పోలీస్ కమిషనరేటు పరిధిలోగల నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ డివిజన్‌లో షీటీమ్ బృందాలను నిఘా ఉంచామని ఎవరైనా మహిళలపట్ల అసభ్యంగా ప్రవర్తించినా, వేధింపులకు గురిచేసినా షీ టీమ్ సెల్ నెంబర్ 87126-59795 గానీ లేదా డయల్ 100గానీ ఫోన్ చేసి తెలియజేయగలరని పేర్కొన్నారు. ప్రస్తుతం గత నెల 1నుంచి 31 వరకు నిజామాబాద్ కమిషనరేట్‌లోని నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ డివిజన్ పరిధిలోగల షీ టీమ్స్ ద్వారా పట్టుబడిన కేసుల వివరాలు ఇలా ఉన్నాయి. నిజామాబాద్‌లో 11, ఆర్మూర్‌లో 03,బోధన్‌లో 01 కాగా.. మొత్తం 15 ఘటనలు జరిగాయని వెల్లడించారు. పట్టుబడిన వారు నిజామాబాద్‌లో 14, ఆర్మూర్‌లో 03, బోధన్‌లో 01,మొత్తం పట్టుబడిన వారు 18 మంది అని తెలియజేశారు. పెట్టి కేసులు నిజామాబాద్ 08, ఆర్మూర్ 03, బోధన్ 01, మొత్తం పెట్టి కేసులు 12 నమోదయ్యాయని వివరించారు. ఎఫ్.ఐ.ఆర్ నమోదు నిజామాబాద్, ఆర్మూర్, బోధన్‌లో ఎఫ్.ఐ.ఆర్‌లు నమోదు కాలేవని తెలియజేశారు. నిజామాబాదులో 3 కౌన్సెలింగ్ చేసినట్టు వివరించారు.

ఉత్తమ ప్రతిభ చూపిన పోస్ట్‌మాస్టర్‌కు సన్మానం


సన్మానం అందుకుంటున్న పోస్టుమాస్టర్

నవతెలంగాణ-భీంగల్

తెలంగాణ సర్కిల్‌లో తపాలా శాఖ ద్వారా ఖాతాల ఓపెనింగ్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానంలో నిలిచిన బ్రాంచ్ పోస్ట్ మాస్టర్ ఎస్కె అప్సర్‌ను శాలువాతో సన్మానించారు. మండలంలోని పిప్రి గ్రామానికి చెందిన బ్రాంచ్ పోస్ట్‌మాస్టర్ తపాలా శాఖ ద్వారా తెలంగాణ సర్కిల్‌లోనే ఎక్కువ మొత్తంలో పొదుపు ఖాతాలను ఓపెన్ చేయించారు. ఈ మేరకు ఆర్మూర్ హెడ్ పోస్ట్ ఆఫీస్‌ను తెలంగాణ చీఫ్ పోస్ట్‌మాస్టర్ జనరల్ కె.ప్రకాష్ శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఉత్తమ ప్రతిభ కనబరిచిన బీపీఎంను అభినందించారు. పూలమాల, శాలువాతో సత్కరించి, జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా పోస్టల్ ఉద్యోగులు ఉత్తమ ప్రతిభ కనబరిచిన బీపీఎంను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా పని చేయాలన్నారు. ప్రతి ఉద్యోగి విధి నిర్వహణలో భాగంగా పోస్టల్ డెలివరీ, నగదు బదిలీ, కొత్త ఖాతాల ఓపెనింగ్, ఇన్సూరెన్స్‌తో పాటు తపాలా శాఖ ద్వారా అందజేస్తున్న పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో సీనియర్ సూపరింటెండెంట్ ఎన్.అనిల్‌కుమార్, అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఆర్మూర్ సురేఖ, ఆర్మూర్ హెడ్‌పోస్ట్‌మాస్టర్ అజయ్ సిబ్బంది పాల్గొన్నారు.

వంద శాతం ఓటరు నమోదు చేపట్టాలి

- కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకునేలా బూత్ లెవెల్ అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది చొరవ చూపాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సూచించారు. వారం రోజుల పాటు ప్రతి నివాస ప్రాంతంలో ఇంటింటికి తిరుగుతూ, ఓటరు జాబితాలో పేర్లు లేని వారిని గుర్తించి ఓటరుగా నమోదు చేయించాలని అన్నారు. ఓటరు జాబితాలో పేర్ల నమోదు, మార్పులు-చేర్పులకు వీలుగా పోలింగ్ బూత్‌ల పరిధిలో ప్రత్యేక శిబిరాలను నిర్వహిస్తున్న నేపథ్యంలో కలెక్టర్ శనివారం జిల్లా కేంద్రంలోని పలు పోలింగ్ బూత్‌లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. నగర పాలక సంస్థ కమిషనర్ ఎం.మకరంద్‌తో కలిసి ప్రభుత్వ బాలుర ఐ.టీ.ఐలో గల పోలింగ్ కేంద్రాన్ని సందర్శించి ప్రత్యేక శిబిరాల నిర్వహణ తీరుతెన్నులు పరిశీలించారు. బీ.ఎల్.ఓ.లు, ఎన్నికల అధికారులు అందుబాటులో ఉన్నారా? అని ఆరా తీసిన కలెక్టర్, అన్ని నియోజకవర్గాల పరిధిలో హాజరును పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. పద్దెనిమిదేళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా పేరు నమోదు చేసుకునేలా చూడాలని బీ.ఎల్.ఓలు, సూపర్వైజర్లకు సూచించారు. ఇంటింటి సర్వే నిర్వహించే సమయంలో ఓటరు నమోదు, మార్పులు చేర్పులకు సంబంధించిన దరఖాస్తు ఫారాలు వెంట ఉంచుకోవాలని సూచించారు. ప్రత్యేక శిబిరాల సందర్భంగా ఎంతమంది పేర్లు నమోదు చేసుకున్నారు, వారిలో 18 - 19 సంవత్సరాల వయస్సు కలిగిన వారు ఎంతమంది ఉన్నారు, వారి వద్ద నుంచి సేకరించిన ధ్రువీకరణ పత్రాలు తదితర వివరాలను కలెక్టర్ ఆరా తీశారు. ఓటరు జాబితాలో పేర్లు తొలగించే విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని, మృతి చెందిన వారి మరణ ధ్రువీకరణ పత్రాన్ని కుటుంబ సభ్యుల నుంచి సేకరించి క్షుణ్ణంగా పరిశీలించాలని హితవు పలికారు. వివిధ కారణాల వల్ల ఎక్కడైనా పోలింగ్ కేంద్రాలు మారినట్లైతే, ఈ విషయాన్ని క్షేత్రస్థాయిలో ఓటర్లకు తెలియజేయాలని, తద్వారా వారు పోలింగ్ సమయంలో గందరగోళానికి గురికాకుండా ఓటు హక్కును వినియోగించుకోగల్గుతారని అన్నారు. కాగా, ప్రత్యేక శిబిరాల గురించి విస్తృత ప్రచారం నిర్వహించాలని, ప్రజలు సద్వినియోగం చేసుకునేలా చూడాలని కలెక్టర్ సూచించారు. కలెక్టర్ వెంట అధికారులు, ఎన్నికల విభాగం సిబ్బంది ఉన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్

నకిలీ విత్తనాలతో నష్టపోయిన
రైతులకు పరిహారం చెల్లించాలి

- ఏఐపీకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి ప్రభాకర్

నవతెలంగాణ-ఆర్మూర్

నకిలీ విత్తనాల ద్వారా నష్టపోయిన రైతులను ఆదుకొని నష్టపరిహారం చెల్లించాలని ఏఐపీకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి ప్రభాకర్ డిమాండ్ చేశారు. నకిలి విత్తనాల ద్వారా నష్టపోయిన రైతులను ఆదుకోవాలని శనివారం మండలంలోని పిప్రి, అందాపూర్, మంథని గ్రామంలో ఏఐపీకేఎస్ ఆధ్వర్యంలో నష్టపోయిన పంటను పరిశీలించారు. అనంతరం సీపీఐఎంఎల్ ప్రజాపంథా డివిజన్ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అఖిలభారత ప్రగతిశీల రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.ప్రభాకర్, రాష్ట్ర కార్యదర్శి బి.దేవారం మాట్లాడుతూ.. అఖిలభారత ప్రగతిశీల రైతు సంఘం బృందం ఆర్మూర్ మండలంలోని పిప్రి, మంథని, అందాపూర్ , కమ్మర్‌పల్లి మండలంలోని హసకొత్తూర్, ఉప్లూర్ తదితర గ్రామాలలో కల్తీ విత్తనాల ద్వారా నష్టపోయిన పంటలను పరిశీలించారు. అదే క్రమంలో కల్తీ విత్తనాలు అమ్మడం ద్వారా తీవ్ర స్థాయిలో పంటలను నష్టపోయారని వారు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కల్తీ విత్తనాలు అమ్మితే నేరం కింద పరిగణించి పీడీ యాక్ట్ కేసులను నమోదు చేస్తామని చెబుతున్న తరుణంలో దానికి భిన్నంగా నకిలీ కంపెనీలు పేరుతో వచ్చి రైతులను నట్టేట ముంచుతున్నారని వారు అన్నారు. అదే క్రమంలో రైతులు దాదాపు ఎకరానికి 25 నుంచి 30 వేల వరకు పెట్టుబడి పెట్టడం ద్వారా రైతులకు వచ్చే ఆదాయం కంటే నష్టమే ఎక్కువ స్థాయిలో ఉందని వారు అన్నారు. గత పది సంవత్సరాల కిందట రాష్ట్ర ప్రభుత్వమే సహకార సంఘాల ద్వారా రైతులకు విత్తనాలను ఎరువులను పంపిణీ చేసిందని వారు అన్నారు. కానీ నేడు దానికి భిన్నంగా కంపెనీల యాజమాన్యాలకు విత్తనాలను అమ్ముకోమన్ని అనుమతులు ఇవ్వడం సరైనది కాదని వారు అన్నారు. కల్తీ విత్తనాల ద్వారా రైతులు నష్టపోవడమే కాకుండా రైతు ఆత్మహత్యలకు కారణమవుతుందని వారు అన్నారు. మరోవైపు వ్యవసాయశాఖ అధికారులు క్షేత్రస్థాయి పర్యటన లేకపోవడం ద్వారా కల్తీ విత్తనాలు అమ్మకం రోజురోజుకు పెరుగుతుందని వారు అన్నారు. వ్యవసాయ అధికారులు, నకిలీ విత్తనాల మాఫియా మిలాఖత్ అయి రైతులకు ముంచే ప్రయత్నం చేస్తున్నారని అనుమానాలు వ్యక్తమవుతుందని వారు గుర్తు చేశారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం నష్టపోయిన పంటలకు నష్టపరిహారం ఇచ్చి రైతులను ఆదుకోవాలని వారు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అదేవిధంగా కల్తీ (నకిలీ)విత్తనాలు అమ్ముతున్న కంపెనీలు కరిష్మా బాహుబలి, అంకుర్, వైగ్రో 11, యాజమాన్యాలపై కఠినంగా చర్యలు తీసుకోవాలని సీజ్ చేయాలని, ప్రభుత్వం దీనిపైన దృష్టి సారించి సహకార సంఘాల ద్వారానే రైతులకు ఎరువులు విత్తనాలను అమ్మకం జరిపించాలని వారు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇదే అంశంపై సోమవారం ప్రజావాణిలో రైతులతో ఉద్యమాన్ని నిర్వహిస్తామని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో రైతు నాయకులు పిట్ట గంగారం, ఏపీ గంగారం, సహకార సంఘం మాజీ అధ్యక్షులు పిప్పిరి గంగారం, లింబాద్రి, కే నర్సయ్య, నిమ్మన్న, రాజేశ్వర్, అశోక్, బి.కిషన్, ఎం.నరేందర్, ఆకుల పెద్ద నరసయ్య, చిన్న రాజేశ్వర్, మోహన్, సాయిరెడ్డి, నవీన్, రాజారామ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వి.ప్రభాకర్

ఉచిత డ్రైవింగ్ లైసెన్స్‌కు విశేష స్పందన



ధ్రువీకరణ పత్రాన్ని అందజేస్తున్న దృశ్యం

నవతెలంగాణ-ఆర్మూర్

స్థానిక ఎమ్మెల్యే, బి.ఆర్.ఎస్ జిల్లా అధ్యక్షులు ఆశన్నగారి జీవన్‌రెడ్డి ఆదేశానుసారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహిస్తున్న ఉచిత డ్రైవింగ్ లైసెన్స్‌కు విశేష స్పందన లభిస్తోంది. మండలంలోని పిప్రి గ్రామానికి చెందిన 100 మందికి శనివారం ఉచిత లైసెన్స్ ధ్రువీకరణ పత్రాలు అందజేసినట్టు ఉప సర్పంచ్ ఆశాపురం శ్రీనివాస్‌రెడ్డి, పీఏసీఎస్ సొసైటీ చైర్మన్ సోమ హేమంత్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి కేసీఆర్, ఎమ్మెల్యేకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

తండ్రి జ్ఞాపకార్థం ఫ్రీజర్ విరాళం


ఫ్రీజర్‌ను అందజేస్తున్న దేవేందర్

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని ఉప్లూర్ గ్రామానికి చెందిన రేగుంట రాజన్న 3వ వర్ధంతిని పురస్కరించుకొని ఆయన జ్ఞాపకార్థం ఆయన కుమారుడు, కమ్మర్‌పల్లి సింగిల్ విండో చైర్మన్, బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు రేగుంట దేవేందర్ ఫ్రీజర్‌ను విరాళంగా అందజేశారు. శనివారం మండల కేంద్రంలోని సింగిల్ విండో కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఫ్రీజర్‌ను సింగిల్ విండో కార్యాలయ సిబ్బందికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అత్యవసర సమయంలో ఫ్రీజర్ అందుబాటులో లేక బాధిత కుటుంబాలు పడే ఇబ్బందులను తొలగించేందుకు, మండల ప్రజల సౌకర్యార్థం తన తండ్రి జ్ఞాపకార్థం ఫ్రీజర్‌ను విరాళంగా అందించడం సంతోషంగా ఉందన్నారు. ఫ్రీజర్ అవసరమైన వాళ్లు కమ్మర్‌పల్లి సొసైటీ సిబ్బందిని సంప్రదించి వినియోగించుకోవాలని ఈ సందర్భంగా దేవేందర్ సూచించారు. విండో కార్యాలయానికి ఫ్రిజర్ విరాళంగా అందించడం పట్ల బీఆర్ఎస్ నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ, దేవేందర్‌ను అభినందించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు మైలారం సుధాకర్, పిప్పెర అనిల్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు బద్దం చిన్నారెడ్డి, బిఆర్ఎస్ పార్టీ మండల ఉపాధ్యక్షులు మల్యాల సుభాష్‌గౌడ్, రైతు విభాగం మండల అధ్యక్షుడు బద్దం రాజశేఖర్, విండో డైరెక్టర్లు రెంజర్ల మహేందర్, తీగల హరీష్, సామా నరేష్, రేణి విజయ్, యూత్ విభాగం మండల అధ్యక్షులు కొత్తపల్లి రఘు, నాయకులు నోముల నరేందర్, సదాశివగౌడ్, సంత రాజేశ్వర్, అవారి గంగారెడ్డి, చిలుకూరి సురేష్, విండో కార్యదర్శి శంకర్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి వరం లాంటిది

- జెడ్పీ ఉపాధ్యక్షురాలు రజిత యాదవ్

నవతెలంగాణ-ఎడపల్లి


తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ ఆడబిడ్డల కొరకు కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలను అమలు చేసి ఎన్నో కుటుంబాలను ఆదుకుంటుందని జెడ్పీ ఉపాధ్యక్షురాలు రజిత యాదవ్ అన్నారు. బోధన్ పట్టణంలోని బోధన్ ఎమ్మెల్యే మహమ్మద్ షకీల్ అమీర్ పార్టీ కార్యాలయంలో శనివారం బోధన్ నియోజకవర్గ పరిధిలోని ఎడపల్లి, నవీపేట్, రెంజల్, సాలూర గ్రామాలకు చెందిన షాదీ ముబారక్, కళ్యాణలక్ష్మి లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. అంతకుముందు ఎంపీపీ శ్రీనివాస్, జెడ్పీ ఉపాధ్యక్షురాలు రజిత ఎల్లయ్య యాదవ్, ఎడపల్లి ఎంపీటీసీ మనిషారెడ్డి, పోచారం ఎంపీటీసీ పద్మ ముత్తన్న తమ గ్రామాల లబ్దిదారులకు, కళ్యాణలక్ష్మి చెక్కులను ఎమ్మెల్యే సూచన మేరకు అందజేశారు. గతంలో ఆడబిడ్డ పెళ్లి చేయాలంటే తల్లిదండ్రులు అప్పు తీసుకొచ్చి పెళ్లిళ్ల చేసేవారని గుర్తు చేశారు. అలాంటి సాధక బాధలు ఆడబిడ్డ పెళ్లి బరువు తల్లిదండ్రుల మీద ఉండకూడదని సీఎం కేసీఆర్ షాదీముబారక్, కళ్యాణలక్ష్మి పథకాలను అమలు చేసి దేశంలోనే తెలంగాణ రాష్ట్రాన్ని ముందంజలో ఉంచారని అన్నారు. తెలంగాణలో అమలవుతున్న సంక్షేమ పథకాలను పక్క రాష్ట్రాల వారు ఆదర్శంగా తీసుకొని సీఎం కేసీఆర్‌ను అభినందిస్తున్నారని తెలిపారు. బోధన్ నియోజకవర్గ ఎమ్మెల్యే మహమ్మద్ షకీల్ అమీర్ ఎడపల్లి, రెంజల్, నవీపేట్, బోధన్, సాలూర మండల పరిధిలోని గ్రామాలలో అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టి ప్రజల అభిమానాన్ని చూరగొంటున్నారని తెలిపారు. ఈ సందర్భంగా లబ్దిదారులు బోధన్ ఎమ్మెల్యే ఎండి షకీల్ అమీర్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఎడపల్లి ఎంపీపీ కే శ్రీనివాస్, ఎంపీటీసీలు గుంజది మనిషారెడ్డి, వనజ నాగరాజు, నాయుడు స్రవంతి పోతన్న, పద్మ ముత్తన్న, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.


కళ్యాణలక్ష్మి చెక్కులు అందజేత

సోయాబీన్ పంటలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

నవతెలంగాణ-బాల్కొండ

ప్రస్తుతం వాతావరణ పరిస్థితులలో మార్పులు, అధిక ఉష్ణోగ్రతలు కారణంగా సోయాబీన్ పంటలో చీడపీడల ఉధృతి అధికంగా ఉన్నదని దానికి అనుగుణంగా సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయ అధికారి మహేందర్ రెడ్డి తెలిపారు. బోదేపల్లి గ్రామంలో శనివారం పంటలను పరిశీలించి రైతులకు సలహాలు సూచనలు ఇచ్చారు. పల్లాకు తెగులులో పసుపు, ఆకుపచ్చ మచ్చలతో ఆకులు కనబడతాయని తెలిపారు. రసం పీల్చే పురుగులు ముఖ్యంగా తెల్ల దోమ ఆశించడం వలన పల్లాకు తెగుళ్ల గమనించవచ్చునని వివరించారు. మొదటగా పల్లాకు తెగులు సోకిన మొక్కలను పీకి వేసి కాల్చేయాలని, పసుపు రంగు కలర్ జిగురు అట్టలను ఎకరానికి 10 చొప్పున అమర్చుకోవాలన్నారు. నివారణకు అసిఫేట్ 300 గ్రాములు లేదా అసిటామిప్రైడ్, బైఫెంత్రిన్ 250 గ్రాములను 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేసుకోవాలన్నారు. అలాగే పెంకు పురుగు, కాండపు ఈగ, ఈ పురుగులు ఆశించడం వల్ల మొక్క చనిపోయి దిగుబడి భారీగా తగ్గే అవకాశం ఉంటుందని దీని నివారణకు తయోమెతక్సిమ్, లంబాడా, సైహెల్లాత్రిన్, 80 ఎంఎల్ లేదా క్లోరంత్రానిలిప్రోలు ం లంబాడా సైహెల్లాత్రిన్ 100 ఎంఎల్ ఏదేని ఒకదానిని 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. కాయ కుళ్ళు తెగులు సోకితే కాయలపై తామర లాంటి మచ్చలు ఏర్పడి పంట దిగుబడిపై ప్రభావం చూపుతుందని అన్నారు. దీని నివారణకు టేబ్యుకొనజోల్ ప్లస్ సల్ఫర్ 500 గ్రాములు ఎకరానికి 200 లీటర్ల నీటిలో కలుపుకొని పిచికారి చేసుకోవాలని మహేందర్ రెడ్డి తెలిపారు.


పంటలను పరిశీలిస్తున్న అధికారులు

నీల గ్రామంలో 'మేరా మిట్టి మేరా దేశ్'


సేకరించిన మట్టితో నాయకులు

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని నీలా, సాటాపూర్ గ్రామాలలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డీ మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో మండలాధ్యక్షులు గోపికష్ణ ఆలయాలలోని మట్టిని సేకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆలయాలలోని పవిత్ర మట్టిని ప్రధాని నరేంద్ర మోడీ ఆదేశాల మేరకు సేకరించి దానిని పంపనున్నట్లు వారి పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు ఖ్యాతం యోగేష్, సీనియర్ నాయకులు మేక సంతోష్, ఎల్.కిషోర్, సోషల్ మీడియా బోధన్ డివిజన్ ఇంచార్జ్ సాయినాథ్ బుజ్జి, పార్థ రమేష్, ఎల్పీ పోచయ్య ప్రకాష్, లోలపు వడ్డెన్న తదితరులు పాల్గొన్నారు.

నూతన కళాశాలలో తరగతులు ప్రారంభం

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇటీవల నూతనంగా ప్రారంభించిన ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తరగతులు ప్రారంభమైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అబ్బ చిరంజీవి శనివారం తెలిపారు. ఇంటర్ ప్రథమ సంవత్సరంలో అడ్మిషన్లు పొందేందుకు గడువును ఈనెల 16వ తేదీ వరకు పొడిగించినట్లు ఆయన తెలిపారు. పదవ తరగతి పాసైన విద్యార్థిని విద్యార్థులు కళాశాలలో ఎంపీసీ, బైపిసి, సిఇసి, హెచ్ఇసి గ్రూపులలో ఇంగ్లీష్ తెలుగు మీడియంలో అడ్మిషన్లు తీసుకోవాలని సూచించారు. ఈ ప్రాంత విద్యార్థిని విద్యార్థుల సౌకర్యార్థం మంత్రి ప్రశాంత్‌రెడ్డి కృషితో ప్రారంభమైన కళాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్

పశువుల కొట్టం దగ్ధం


మృత్యువాతపడిన గేదె

- గేదె మృతి

నవతెలంగాణ-మాచారెడ్డి

మాచారెడ్డి మండలంలోని అక్కపూర్ గ్రామంలో శనివారం రాత్రి సుమారు రెండు గంటల సమయంలో బట్ట రమేష్ కు చెందిన పశువుల కొట్టాంకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించడంతో దగ్ధమైంది. ఒక గేదెకు తీవ్ర గాయాలు కావడంతో మృతి చెందింది. మరొక గేదెకు 80 శాతం కాలిన గాయాలు అయ్యాయి. ఉన్న మూడు ట్రాక్టర్ ల గడ్డివాములు కూడా దగ్ధమయ్యాయని వీటి విలువ సుమార లక్ష 30 వేల రూపాయలు ఉంటుందని రైతు కుటుంబ సభ్యులు తెలిపారు.

పోషక వారోత్సవాలు

నవతెలంగాణ-లింగంపేట్

లింగంపేట్ మండలంలోని మోతె గ్రామంలో శనివారం మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పోషక వారోత్సవాలు నిర్వహించారు. గ్రామ సర్పంచ్ ఏలేటి రామిరెడ్డి మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణీలకు బాలింతలకు పౌష్టికాహారం అందుతుందని తెలిపారు. బిడ్డ ధృఢంగా ఉండాలంటే పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. తెలంగాణ ప్రభుత్వం గర్భిణీలకు బాలింతలకు అంగన్వాడి కేంద్రాల్లో పాలు గుడ్లు పౌష్టికాహారం అందిస్తున్నానన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ స్వరూప, అంగన్వాడీ కార్యకర్తలు గంగ, గంగమణి, గర్భిణీలు, బాలింతలు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలు పొంది విమర్శించే వారిని నిలదీయండి

- ఎమ్మెల్యే షకీల్ ఆమీర్

నవతెలంగాణ-బోధన్

ముఖ్యమంత్రి కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పొంది ముఖ్యమంత్రిని ప్రతిరోజు విమర్శిస్తున్న బీజేపీ, కాంగ్రెస్ పార్టీ నాయకులను వారి ఇంటి వద్దకు వెళ్లి కార్యకర్తలు నిలదీయాలని బోధన్ ఎమ్మెల్యే షకీల్ ఆమేర్ బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. శనివారం బోధన్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలు షాదీముబారక్, కళ్యాణలక్ష్మి, రైతుబంధు, రైతుబీమా లాంటి పథకాలు అమలు చేస్తూ లబ్దిదారుల ఖాతాలలో కోట్ల రూపాయలను మంజూరు చేసిందని


చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

అన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాలలో తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అమలు కావడం లేదని అన్నారు. ఎన్నికల సందర్భంగా ప్రజలకు మాయమాటలు చెప్పే వారిని నమ్మవద్దని అన్నారు. గతంలో ఒక ఆడపిల్ల పెళ్లి చేయాలంటే తల్లిదండ్రులు ఎన్నో తిప్పలు పడే పరిస్థితి ఉండేదని, కానీ కేసీఆర్ ప్రభుత్వం వచ్చిన తర్వాత లక్షా 116 రూపాయల ఆర్థిక సాయం చేయడంతో ఆడపిల్ల పెళ్ళికి ఇబ్బందులు లేకుండా అయిందని అన్నారు. కావున ప్రభుత్వ సహాయం పొందిన ఆడపిల్లల తల్లిదండ్రులు ఆలోచించి ఓటు వేయాలని కోరారు.

5 నుంచి ఉచిత డ్రైవింగ్ లైసెన్స్ మేళా..

బోధన్ నియోజకవర్గంలోని యువతీ, యువకుల సౌకర్యార్థం సెప్టెంబర్ 5వ తేదీ నుంచి ఉచిత డ్రైవింగ్ లైసెన్స్ మేళా నిర్వహించనున్నట్టు తెలిపారు. కావున 18 సంవత్సరాల నుంచి 30 సంవత్సరాల వరకు వయస్సు గల యువతీ యువకులు డ్రైవింగ్ లైసెన్స్ కోసం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో దరఖాస్తులు చేసుకోవాలని ఎమ్మెల్యే షకీల్ ఆమేర్ సూచించారు. డ్రైవింగ్ లైసెన్స్ పొందడానికి అయ్యే ఖర్చును తానే భరిస్తానని హామీనిచ్చారు. కార్యక్రమంలో జడ్పీ వైస్‌చైర్మన్ రజితయాదవ్, ఏఎంసీ చైర్మన్ వీఆర్ దేశాయ్, డిసిసిబి డైరెక్టర్ గిర్ధవార్ గంగారెడ్డి, ఎడపల్లి ఎంపీపీ శ్రీనివాస్, పట్టణ అధ్యక్షులు రవీందర్ యాదవ్, ఫ్లోర్ లీడర్ గంగారాం తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోటుబుక్కులు పంపిణీ


నోటుబుక్కులు పంపిణీ చేస్తున్న శివారెడ్డి

నవతెలంగాణ-బోధన్

సొసైటీ ఫర్ ఆల్ ఇన్ నీడ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శనివారం బోధన్ మున్సిపల్ పరిధిలోని నర్సాపూర్ గ్రామంలో గల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు నోట్ బుక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు శివారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల సౌకర్యార్థం తమ వంతు సహాయం చేయాలనే లక్ష్యంతో నోట్ పుస్తకాలను అందించినట్లు తెలిపారు. విద్యార్థులు తమ సంస్థ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం సంస్థ ప్రతినిధులకు పాఠశాల తరపున గ్రామస్తులు, ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు ప్రకాష్, అంతయ్య, రిటైర్డ్ టీచర్ శివరెడ్డి, స్కూల్ హెడ్ మాస్టర్ గంగాధర్, ఎస్టీ సెల్ టౌన్ ప్రెసిడెంట్ జాదవ్ ప్రవీణ్ నాయక్, అంగన్‌వాడీ టీచర్ విజయ, పుష్ప లత, మేనక తదితరులు పాల్గొన్నారు.

మహిళా డిగ్రీ కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ-వర్ని

మండలంలోని కొటయ్యక్యాంప్ సంస్కార్ ఆశ్రమంలో మహాత్మ జ్యోతిబాపూలే మహిళా డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేసిన నేపథ్యంలో 2023-24 సంత్సరానికి ఇంటర్ పూర్తి చేసుకొని డిగ్రీలో ప్రవేశించే మహిళ విద్యార్థులకు డిగ్రీలో ప్రవేశించడానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ మాధురి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీ కళాశాలలో బీఏ ఈపీహెచ్, ఎకనామిక్స్, పొలిటికల్ సైన్స్, హిస్టరీ, బీసీ సీఏ కంప్యూటర్, బీఎస్సీ బీజెడ్సీ, బోటనీ, జువాలజీ, కెమిస్ట్రీ, బీఎస్సీ ఎంపీసీఎస్ మ్యాథ్స్, ఫిజిక్స్, కంప్యూటర్ సైన్స్ గల కోర్సులలో ప్రవేశాలకు విద్యార్థులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పరంగా విద్యార్థులకు ఉచిత భోజనం వసతి, నోట్ బుక్కులు, యూనిఫామ్‌లతో పాటు నాణ్యమైన విద్య అందించనున్నట్టు పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకొనేవారు మరిన్ని వివరాల కోసం 91540102670, 6306541925 నెంబర్లను సంప్రదించాలని తెలిపారు.

కరెంటు వైర్లకు తగిలే చెట్ల తొలగింపు


చెట్లను తొలగిస్తున్న దృశ్యం

నవతెలంగాణ-రెంజల్

మండల కేంద్రంలోని సబ్ స్టేషన్ ప్రహరీ పక్కన ఉన్న చెట్లు పైన కరెంటు వైర్లకు తగులుతుండడంతో విద్యుత్ ఏఈ రాజలింగం ఆధ్వర్యంలో జేసీబీతో తొలగించారు. సబ్‌స్టేషన్‌లో తరచుగా కరెంటు వైర్లకు చెట్లు తగలడంతో కరెంటు సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుందని, దీనిని దృష్టిలో పెట్టుకొని ప్రహరీ చెట్టు ఉన్న మొక్కలను తొలగించినట్లు ఆయన పేర్కొన్నారు. ఆయన వెంట సీనియర్ లైన్ ఇన్‌స్పెక్టర్లు డి సి రాజు, సంజీవ్ కుమార్, బోర్గం లైన్మెన్ వైద్యనాథ్ తదితరులు పాల్గొన్నారు.

సేవ అలవర్చుకోవడం గొప్ప విషయం

- డీఈవో దుర్గాప్రసాద్

నవతెలంగాణ-మోపాల్

సేవ అలవర్చుకోవడం గొప్ప విషయమని డీఈవో దుర్గాప్రసాద్ అన్నారు. మండల కేంద్రంలో గల ప్రెసిడెన్సి ఉన్నత పాఠశాలలో శనివారం 'సేవా' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా విద్యాశాఖ అధికారి దుర్గాప్రసాద్, పాఠశాల చైర్మన్ శ్రీమంతరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా డిఈఓ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ.. విద్యార్థులకు చిన్నప్పటి నుండి సేవా తాత్పర్యం అలవర్చుకోవడం గొప్ప విషయమని, ఇందుకు కృషి చేసిన పాఠశాల యాజమాన్యానికి, విద్యార్థులకు ఆయన అభినందించారు. ఈ సేవా తాత్పర్యం వల్ల ఎంతోమంది పిల్లలకు భోజన రూపంలో కానీ వస్తురూపేనా కానీ పేద విద్యార్థులకు సేవలు అందించడం చాలా గొప్ప విషయమని, అన్నీ దానాల కంటే అన్నదానం గొప్పదని చిన్నప్పటి నుంచి ఇటువంటి సేవా తాత్పర్యం అలవాటు చేసుకోవాలని ఆయన తెలిపారు. ఆరవ తరగతి, ఏడో తరగతి విద్యార్థులు వారి ఇంటి వద్ద నుంచి తయారు చేసిన నాణ్యమైన ఆహారాన్ని, పిల్లలకు ఇష్టపూర్వకమైన పిండి వంటలు, పండ్లు, తీసుకువచ్చి మోపాల్ మండల కేంద్రంలో ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న పిల్లలకి ఇవ్వడం చాలా సంతోషకరమన్నారు. అందులో చదువుకునే పిల్లలలో కొందరు నిరుపేదలు ఉండడం వల్ల వారికి సరియైన, రుచికరమైన ఆహార పదార్థాలు తినటానికి ఉండవని, అటువంటి వారి కోసం ఇటువంటి సేవా తాత్పర్యం ఉన్న, పిల్లలందరూ అందించడం గొప్ప విషయమని తెలిపారు. ఇలాంటి కార్యక్రమాన్ని మిగతా పాఠశాలలు కూడా ఆదర్శంగా తీసుకొని పేదరికంలో ఉన్న పిల్లలకు తోడ్పాటు అందించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానాచార్యులు పవన్ కుమార్, డీన్ అధికారి మహేష్, ఉపాధ్యాయ బృందం, వ్యాయామ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.


సేవాకార్యక్రమంలో విద్యార్థులు, డీఈవో

చేపూర్, మామిడిపల్లి అంగన్వాడీ కేంద్రాల్లో పోషణ వారోత్సవాలు


చేపూర్‌లో పోషణ వారోత్సవాలు

నవతెలంగాణ-ఆర్మూర్

మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి 6 అంగన్వాడీ కేంద్రంలో, మండలంలోని చేపూర్ గ్రామ అంగన్వాడీ కేంద్రాల్లో పోషకాహార వారోత్సవాల కార్యక్రమాలు శనివారం నిర్వహించారు. పరిసరాలలో దొరికే సహజ సిద్ధమైన కూరగాయలు, చిరుధాన్యాలు, ఐరన్, కాల్షియం ఉండే ఆహార పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలని గర్భవతులకు, బాలింతలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సిడిపిఓ భార్గవి, ఏసిడిపిఓ జ్యోతి, అంగన్వాడీ సూపర్వైజర్లు శ్రీదేవి, వెంకట రమణమ్మ, అంగన్వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

రెంజల్ ఏపీఎం, సీసీని వెంటనే నియమించాలి


మాట్లాడుతున్న మహిళలు

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని ఐకేపీ కార్యాలయంలో పనిచేసిన ఏపీఎం, సీసీ బదిలీపై వెళ్లి నేటికీ 19 రోజులు కావస్తున్నా నూతన ఏపీఎం, సీసీని నియమించకపోవడం శోచనీయమని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం సర్పంచ్ ఎం.ఎస్.రమేష్ కుమార్ ఆధ్వర్యంలో వారు విలేకరులతో మాట్లాడారు. గత 19 రోజులుగా స్థానిక వీవోఏ, సీఏకు తమ బాధలను విన్నవించిన వారు పట్టించుకోవడం లేదని, కొన్ని మహిళా గ్రూపులకు రుణాలు మంజూరు కావాల్సి ఉండగా సీసీ సంతకం అవసరం కావడంతో వారు కొత్త వారిని వెంటనే నియమించాలని డిమాండ్ చేశారు. తమ ఆర్థిక ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని సంబంధిత అధికారులు వెంటనే స్పందించి ఏపీఎం, సీఏను నియమించాలని వారు స్పష్టం చేశారు. కార్యక్రమంలో రెంజల్ మండలంలోని డ్వాక్రా గ్రూపు మహిళలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ పోస్టులను వెంటనే భర్తీ చేయాలి

నవతెలంగాణ-భీంగల్

రాష్ట్ర ప్రభుత్వం డీఎస్సీ నోటిఫికేషన్ ప్రకటించి ఉపాధ్యాయ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని ఎన్ఎస్‌యుఐ బాల్కొండ నియోజకవర్గ అధ్యక్షుడు అర్గుల అక్షయ్ డిమాండ్ చేశారు. ఎన్ ఎస్ యు ఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూర్ వెంకట్ ఆదేశాల మేరకు డీఎస్సీ నోటిఫికేషన్ ప్రకటించాలని భీంగల్ పట్టణ కేంద్రంలో అంబేద్కర్ చౌరస్తా వద్ద ఒక్కరోజు దీక్ష చేపట్టారు. ఈ దీక్షకు మద్దతుగా ముత్యాల సునీల్‌రెడ్డి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం విద్యార్థులకు, నిరుద్యోగులకు మోసపూరిత హామీలను ఇచ్చి మభ్యపెడుతుందని అన్నారు. మన నీళ్లు, మన నిధులు, మన నియామకాలు కోసం మరోసారి ఉద్యమించాల్సిన సమయం ఆసన్నమైందని. రాష్ట్ర వ్యాప్తంగా యువత పిడికిలి బిగించి ఈ నిరంకుశ పాలనకు చెరమగీతం పాడాలని సూచించారు. గత సంవత్సరం నిండు అసెంబ్లీ సాక్షిగా 13000 ఉపాధ్యాయ పోస్టులు


మాట్లాడుతున్న సునీల్‌రెడ్డి

ఖాళీగా ఉన్నాయని చెప్పి కేవలం 5000 పోస్టులకు నోటిఫికేషన్ ఇవ్వడం సిగ్గుచేటని అన్నారు. కావున వెంటనే ఖాళీగా ఉన్న 25000 పోస్టులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

అనంతరం దీక్ష చేపట్టిన ఎన్ ఎస్ యు ఐ కార్యకర్తలకు నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింప చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ ఎస్ యు ఐ నాయకులు రహమాన్ సత్యనారాయణ పవన్ కార్యకర్తలు పాల్గొన్నారు.

మాజీ ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతిని పురస్కరించుకొని కాంగ్రెస్ నాయకుడు ముత్యాల సునీల్ రెడ్డి ఆధ్వర్యంలో నివాళులర్పించారు. చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో భీంగల్ మండల అధ్యక్షులు బొదిరే స్వామి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు నాగేంద్ర, డిసిసి కార్యదర్శి కుంట రమేష్, పట్టణ అధ్యక్షులు నర్సయ్య, ఎస్టి సెల్ అధ్యక్షులు గోపాల్ నాయక్, సెల్ అధ్యక్షులు అనంతరావు, మహిళ అధ్యక్షురాలు కల్పన, కొరాడి రాజు, పల్లె శేఖర్, సుదర్శన్ గౌడ్, నితీష్ రెడ్డి, చిన్నరెడ్డి, అవినాష్, వాక మహేష్, శివ, మహేష్, రవి, బొర్రన్న, విక్రమ్, రాములు,సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాలో పొరపాట్లకు తావివ్వొద్దు

- అడిషనల్ కలెక్టర్ చిత్ర మిశ్రా


అధికారులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

నవతెలంగాణ-ముప్కాల్

ఓటర్ల జాబితాలో పొరపాట్లకు తావివ్వొద్దని అడిషనల్ కలెక్టర్ చిత్ర మిశ్రా అన్నారు. శనివారం మండల కేంద్రంలోని జిల్లా ప్రభుత్వ ఉన్నత పాఠశాలను జిల్లా అదనపు కలెక్టర్ చిత్ర మిశ్రా సందర్శించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు నరేందర్‌ను అడిగి పాఠశాల పనితీరును తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజన పనితీరును పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు పౌష్టికాహారం అందించాలని సూచించారు. అదేవిధంగా పాఠశాల ఆవరణలో విధులు నిర్వర్తిస్తున్న బీఎల్‌వోల పనితీరును పరిశీలించారు. ఓటు హక్కులో ఎటువంటి లోపాలు ఉండకూడదని, ప్రతి ఒక్క బీఎల్‌ఓ ఇంటింటికి తిరిగి సేకరించిన సమాచారాన్ని ఎస్వో సూచన మేరకు ప్రభుత్వానికి అందించాలని సూచించారు. ఓటర్ల జాబితాలో పొరపాట్లకు తావివ్వకుండా పనిచేయాలని అన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ శ్రీకాంత్, ఎస్వో గంగాధర్, బీఎల్వోలు అమీనా బేగం, వాణి, రెవెన్యూ అధికారులు పృథ్వీరాజ్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

పోషకహారంపై విద్యార్థులకు సూచనలు


పోషకాహారంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

నవతెలంగాణ-ముప్కాల్

'పోషణ మాసం' కార్యక్రమంలో భాగంగా శనివారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో ముప్కాల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలతో పాటు స్థానిక కేజీబీవీ పాఠశాలలో పాఠశాల విద్యార్థులకు పోషకహారం ప్రాముఖ్యతను, బాలిక విద్య, బాల్య వివాహం వంటి పలు అంశాలపై అవగాహన కల్పించినట్టు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మాధవి అన్నారు. సమయానికి ఆహారం తీసుకోవడం వల్ల ఎలాంటి రోగాలు రాకుండా పూర్తి ఆరోగ్యంగా ఉంటారని ఈ విషయాన్ని విద్యార్థులు తూచా తప్పకుండా పాటించాలని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు గుండోజి నరేందర్, కేజీబీవీ పాఠశాల ప్రిన్సిపాల్ వినోద, మహిళా శిశుసంక్షేమ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

మంత్రి ప్రశాంత్‌రెడ్డికే మద్దతు, మా ఓట్లు

- కమ్మర్‌పల్లి మాదిగ సంఘం సభ్యుల ఏకగ్రీవ తీర్మానం

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండల కేంద్రంలోని మాదిగ సంఘం సభ్యులు రాబోయే శాసనసభ ఎన్నికల్లో రాష్ట్ర రోడ్లు భవనాలు, గృహ నిర్మాణ, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ బాల్కొండ నియోజకవర్గ అభ్యర్థి వేముల ప్రశాంత్‌రెడ్డికే తమ మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. ఈ మేరకు శనివారం మాదిగ సంఘం భవనంలో సంఘం సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. రాబోయే ఎన్నికల్లో ఎవరికి మద్దతు ఇవ్వాలనే విషయమై చర్చించారు. మెజారిటీ సభ్యుల అభిప్రాయం మేరకు మంత్రి ప్రశాంత్‌రెడ్డికే మద్దతిస్తూ, సంఘం సభ్యుల ఓట్లన్నీ ఆయనకే వేస్తామని తీర్మానం చేశారు. కాగా సంఘంలో 64 కుటుంబాలున్నాయి. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు మైలారం సుధాకర్, ఉపసర్పంచ్ పాలెపు చిన్న గంగారం, వార్డు సభ్యుడు కొంటి కంటి నరేందర్, కుల సంఘ పెద్ద మనుషులు కార్తీక్, కనక రాజన్న, బాలు, మారుతీ, నరేష్, సురేష్, సంఘ సభ్యులు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో పాల్గొన్న మాదిగ సంఘం సభ్యులు

రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయునిగా డా.కాసర్ల

నవతెలంగాణ-కంఠేశ్వర్

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రస్థాయిలో అందించే ఉత్తమ ఉపాధ్యాయునిగా డా.కాసర్ల నరేశ్‌రావు ఎంపికయ్యారు. ఉపాధ్యాయ దినోత్సవమైన సెప్టెంబరు 5న డా.కాసర్ల ఈ అవార్డును రాష్ట్ర ముఖ్యమంత్రి చేతుల మీదుగా అందుకోనున్నారు.

తెలంగాణ జనరల్ పోస్టుమాస్టర్ ఆకస్మిక తనిఖీ

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని హెడ్ పోస్టాఫీస్‌లో తెలంగాణ పోస్ట్ మాస్టర్ జనరల్ తెలంగాణ కె.ప్రకాష్ శనివారం ఆకస్మికంగా సందర్శించి పర్యవేక్షణ చేపట్టారు. ఈ తనిఖీలో పోస్ట్ ఆఫీస్ డెలివరీ ఫర్ ఫార్మెన్స్, నగదు బదిలీ, కొత్త పథకాలు, ఇన్సూరెన్స్, పోస్టాఫీసులోని వివిధ పథకాల అమలు తీరు గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. నూతన ఖాతాల ఓపెనింగ్‌లో తెలంగాణ సర్కిల్‌ను ప్రథమ స్థానంలో నిలిపిన భీంగల్ మండలంలోని పిప్రి బ్రాంచ్ పోస్ట్‌మాస్టర్ ఎస్.కె.అప్సర్‌ను శాలువతో సన్మానించి, అభినందించారు. కార్యక్రమంలో జిల్లా సీనియర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోస్టాఫీసెస్ ఎన్.అనిల్‌కుమార్, ఆర్మూర్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ పోస్ట్ ఆఫీసెస్ అధికారిణి యాపరు సురేఖ, హెడ్ పోస్ట్‌మాస్టర్ కె.అజయ్ కుమార్, జిరాయత్‌నగర్ సబ్ పోస్ట్ ఆఫీస్ ఎస్పీఎం ఆంజనేయులు, ఎంవోలు దశరథ్, చంద్రశేఖర్, బీపీఎంలు, ఏబీపీఎంలు తదితరులు పాల్గొన్నారు.


తనిఖీ చేస్తున్న కె.ప్రకాష్

నటరాజ నృత్య నికేతన్ చిన్నారుల ప్రతిభ

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని నటరాజ నృత్య నికేతన్ సంస్థ ఆధ్వర్యంలో 48 ఆల్ ఇండియా లెవెల్ డాన్స్ కాంపిటీషన్స్ నవ్యనాటక సమితి కాంపిటీషన్స్‌లో పట్టణానికి చెందిన చిన్నారులు ప్రతిభ కనబర్చారు. గాదె దేవాన్షి, అల్లకొండ తనవి సబ్ జూనియర్ కేటగిరీలో ద్వితీయ, తృతీయ స్థానంలో నిలిచి రవీంద్రభారతి ఆడిటోరియంలో జ్ఞాపక ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు. అని నాట్యగురువు భాశెట్టి మృణాళిని శనివారం తెలిపారు. ఈ సందర్భంగా చిన్నారుల తల్లిదండ్రులు ప్రశంసలు అభినందనలు తెలిపారు.